సూర్య
నేటి దినపత్రిక
www.suryaa.com
ఆదివారం
17.12.2023



# ధనుర్మాసం వచ్చేసింది

# చైర్మన్‌తో ముఖాముఖి



**నూకారపు సూర్యప్రకాశరావు**
**చైర్మన్, నేటి దిన పత్రిక సూర్య**

**ఇప్పుడు ఇదే మాట వినిపిస్తోంది. దేశ వ్యాప్తంగా ఐదురాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ప్రజలను తమవైపు తిప్పుకొనేందుకు పార్టీలు తమవంతు ప్రయత్నాలు చేస్తున్నాయి. చేశాయి. అయితే.. ఒక్క ఈశాన్య రాష్ట్రం మిజోరాంలో తప్ప.. అసెంబ్లీ ఎన్నికలు జరిగిన మధ్యప్రదేశ్,ఛత్తీస్‌గఢ్, ప్రస్తుతం ఎన్నికలు జరుగుతున్న రాజస్థాన్‌లోనూ నోట్ల కట్టల పంపిణీ విరివిగా సాగింది. ఇందులో ఏమీ ఎలాంటి అభ్యంతరం, భయం కూడా లేదని అభ్యర్థులే చెబుతున్నారు. ఇతేవటి సార్.... ఈ విచ్చలవిడితనం. మీరేమంటారు.**

**– బందులుప్పి విజయలక్ష్మి, హైదరాబాద్**

ఔను. మీరు అన్నది నిజమే విజయగారూ.... ఏదీ ఊరేకే రాదు. ప్రజలు తమ సమయాన్ని మా కోసం వెచ్చించి లైన్‌లో నిలబడి సుదూర ప్రయాణం చేసి వస్తున్నారు. కాబట్టి.. వారికి ఖర్చుల కింద అడ్వాన్స్‌గా కొంత సొమ్ము ఇస్తే.. తప్పేంటి? అని రాజస్థాన్‌కు చెందిన బీజేపీ నాయకుడు ప్రశ్నించడం అందరినీ విస్మయానికి గురి చేసిందని చెప్పక తప్పది. . అయితే.. ఇది వివాదం కాలేదు కరికదా.. కాంగ్రెస్ నేతల నుంచి కూడా సమర్థన వ్యాఖ్యలే వినిపించడం గమనార్హం. పేదలు.. పాపం దూర ప్రాంతాల నుంచి ఎన్నికలలో ఓటు వేసేందుకు వస్తున్నారు. మేం స్వయంగా వాహనాలు ఏర్పాటు చేయడానికి నిబంధనలు అడ్డు వస్తున్నాయి. అందుకే ప్రయాణ, భోజన ఖర్చులు ఇవ్వడం తప్పుకాదు. ఇది ప్రలోభం కాదు అని కాంగ్రెస్ పార్టీ రాజస్థాన్ చీఫ్ బీజేపీకి వంత పాడటం విశేషం. . తెలంగాణ లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. కొన్ని కొన్ని చోట్ల.. ఇరు పార్టీల అభ్యర్తులు కూడా సర్దుకు పోతున్నారు వాస్తవానికి ప్రత్యర్థి వర్గం.. ఓటర్లకు డబ్బులు పంచితే.. మరో వర్గం దానిని బట్టబయలు చేసే సంస్కృతి కొన్నాళ్లు సాగింది. కానీ, ఇప్పుడు సర్దుకు పోయే సంస్కృతి వచ్చింది. ఆయనా పంచుతున్నాడు.నేను కూడా పంచుతున్నా.. ఒకరిపై ఒకరు నిఘాపెడితే.. వచ్చేదేముందని ఉమ్మడిఖమ్మం జిల్లాకు చెందిన ఓ సీనియర్ నాయకుడు ఇటీవల బహిరంగంగానే వ్యాఖ్యానించారు. అంతేకాదు.. డబ్బులు పంచడాన్ని కూడా ఆయన సమర్థించాడు. ఇక, ఈ కీలక సమయంలో పెద్దనోట్ల రద్దు విషయం రాజకీయాల్లో హాట్ టాపిక్ అయింది. పెద్ద నోట్లు ఉండి ఉంటేనా? అంటూ.. నాయకులు శూన్యంలోకి చూస్తూ.. నిట్టూరుస్తున్నారు. ప్రస్తుతం రూ.500లకు మించి పెద్దనోటు లేదు. వీటిని తరలిస్తూ.. పట్టుబడుతున్న ఘటనలు తెలిసిందే. ఈ నేపథ్యంలోనే మరోసారి నేతల మధ్య పార్టీలకు అతీతంగా పెద్దనోట్ల వ్యవహారం.. చర్చకు రావడం గమనార్హం.

**తెలంగాణ రాష్ట్ర శాసనసభకు ఈనెల 30 ఎన్నికల నిర్వహణకు ఒక పక్క అధికార యంత్రాంగం ఏర్పాట్లు ముమ్మరంగా చేస్తుండగా మరో పక్క రాజకీయ పార్టీలు ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు చివర ప్రయత్నాలు ప్రారంభించాయి%ొా%బీఆర్ యస్ ,కాంగ్రెస్ ,బీజేపీ ఎవరికీ వారే గెలుపు ధీమాతో ఉన్నాయి%ొా%అభ్యర్థులు నిద్రాహారాలుమాని ప్రచారానికి పరుగులు పెడుతున్నారనిపిస్తొంది, మీరేమంటారు.**

**కర్రి రామ్ ప్రసాద్, వరంగల్**

అవును రామ్ గారూ... ఈనెల 28 సాయంత్రంతో ఎన్నికల ప్రచారం ముగియనుండగా ఎన్నికలు జరుగుతున్న మిగతా రాష్ట్రాల్లో ప్రచారం ముగియడం కొన్ని చోట్ల పోలింగ్ ముగియడంతో తెలంగాణ పై రాజకీయ వాతారణం కేంద్రీకృతమైంది %ొా%అన్ని పార్టీల జాతీయ నాయకులూ శుక్రవారం నుంచి రాష్ట్రానికి క్యూకట్టారు %ొా% బీజేపీ తరుపున ప్రధాని మోడీ చివరి మూడు రోజులు ప్రచారంలో పాల్గొననుండగా , కేంద్ర హెూమ్ మంత్రి అమిత్ షా , రాజ్ నాథ్ సింగ్ , జెపి నడ్డా, పలువురు కేంద్ర మంత్రులు విసుగు విరామం లేకుండా ప్రచారంలో పాల్గొంటున్నారు %ొా%కాంగ్రెస్ నుంచి ఇప్పటికే ఏఐసీసీ అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గే ,ఆపార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ , జైరాం రమేష్ , కర్ణాటక సీఎం సిద్దరామయ్య , డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ , అధికార ప్రతినిదులు , వివిధ సంఘాల నాయకులు ముమ్మరంగా ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నారు %ొా%అధికార బీఆర్ యస్ నుంచి సీఎం కేసీఆర్ అన్ని నియోజకవర్గాల్లో ప్రచారం చిరవదశకు చేరుకోగా , పార్టీ వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్ , మంత్రి హరీష్ రావు , ఎమ్మెల్సీ కవిత బీఆర్ యస్ అభ్యర్థుల తరుపున జరుపుతున్న ప్రచారం పతాక స్థాయికి చేరింది%ొా%ఎంఐఎం తరుపున అసదుద్దీన్ ఒవైసి , అక్బరుద్దీన్ ఒవైసి ఆపార్టీ తరుపున ప్రచారం నిర్వహిస్తున్నారు .. సిపిఐ కాంగ్రెస్ లో పొత్తులో భాగంగా పోటీచేస్తున్న కొత్తగూడెం లో ఆపార్టీ ప్రధాన కార్యదర్శి డి .రాజా, జాతీయకార్యదర్శి డాక్టర్ కె నారాయణ ప్రచారంలో పాల్గొన్నారు .. సిపిఎం రాష్ట్రంలో 19 నియోజకవర్గాల్లో ఒంటరిగా పోటీచేస్తుండగా ,జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి , ఆపార్టీ అగ్రనాయకులు మాణిక్ సర్కార్ , బృంద కారత్ , బీవీ రాఘవులు లాంటి వారితో ప్రచారం హెూరెత్తిస్తున్నారు %ొా%బీఎస్పీ అధినేత్రి కుమారి మాయావతి ఆపార్టీ అభ్యర్థుల తరుపున ప్రచారం నిర్వహించారు %ొా%కొన్ని నియోజకవర్గాల్లో స్వంతంత్ర అభ్యర్థులు కూడా గట్టి పోటీనిస్తూ ప్రధాన పార్టీల అభ్యర్థులకు చెమటలు పుట్టిస్తున్నారు %ొా% మొత్తం రాష్ట్రంలో ఉన్న 119 నియోజకవర్గాలకు ఒకేసారి నవంబర్ 30 ఎన్నికలు జరగనున్నాయి%ొా%2290 అభ్యర్థులు పోటీలో ఉన్నారు %ొా%3 .17 కోట్ల మందికి పైగా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవాల్సి ఉంటుంది%ొా%ఇప్పటికే ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు అధికార యంత్రాంగం ఓటర్లు స్లిప్పలను పంపిణి చేసింది%ొా% జయాపజయాలను ఓటర్లే నిర్ణయిస్తారు. అంతా వారి చేతుల్లోనే ఉంది.

# చేనేత పితామహుడు ప్రగడ కోటయ్య

**లెజెండ్**



సనాతన సాంప్రదాయాలకు, ప్రాచీన సంస్కృతికి అనాదిగా ఆలవాలమైన భారత దేశంతో చేనేత విడదీయలేని బంధం అనుబంధం, సంబంధం కలిగి ఉంది. భారతీయత సాంస్కృతిక కళలలో ముఖ్యమైనదై, వారసత్వానికి ప్రతీక అయిన చేనేత కళ దేశానికి గర్వకారణం. భారత స్వాతంత్ర్యోద్యమంలో ప్రధాన భూమిక పోషించి, స్వాతంత్ర్య సమపార్జనకు ఒక సాధనంగా నిలిచింది చేనేత. గాంధీజీ కూడా రాట్నంపై నూలు వడకడానికి అత్యంత ప్రాధాన్యం ఇచ్చారు. అంతటి ప్రాధాన్యత కలిగిన చేనేతనే ఊపిరిగా జీవించి, చేనేత కార్మికుల సమస్యలపై నిరంతరం పోరాడి, వ్యవసాయ రంగం తర్వాత చేనేతకు గుర్తింపు తెచ్చిన చిత్తశుద్ధి గల జాతీయ నేత ప్రగడ కోటయ్య. ఆయన భారత స్వాతంత్ర్య సమరయోధుడు, ఉత్తమ పార్లమెంటే రియన్. చేనేత ఉద్యమానికి నాయకుడు .

జాతీయ ఉద్యమంలో చురుకైన పాత్ర పోషిస్తునే, చేనేత పరిశ్రమ రక్షణ కోసం పోరాడిన యోధుడు ప్రగడ కోటయ్య. ఎన్.జి.రంగా అడుగు "జాడలలో నడిచి మహాత్మా గాంధీ ఆశీస్సులతో జాతీయ చేనేత కాంగ్రెస్ స్థాపించి ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారు. చేనేత కార్మికులకు ప్రయోజనం కలిగించేందుకు సహకార సంఘాలు ఒక మార్గంగా సూచించారు. మగ్గంతో బట్టలు నేసే కుటుంబంలో పుట్టి పెరిగిన కోటయ్య దేశవ్యాప్త చేనేత కార్మికుల ప్రయోజనాలే లక్ష్యంగా కొన ఊపిరి వరకు నిరంతరం శ్రమించారు. చేనేతరంగంతో పాటు రైతులు, జిన్నింగ్, స్పిన్నింగ్, కాంపోజిట్ మిల్లులపై ఆమూలాగ్రం అధ్యయనం చేసిన పరిశోధనా విద్యార్థి కోటయ్య .

గుంటూరు జిల్లా నిడుబ్రోలులో ప్రగడ వీర భద్రుడు, కోటమ్మ దంపతులకు 1915 జూలై 26న కోటయ్య జన్మించారు. 1931లో ఎస్ఎస్ఎల్సీ స్కూలు ఫైనల్ ఉత్తీర్ణత సాధించి, కొంత కాలం బాపట్ల తాలూకా బోర్డులో ఉపాధ్యాయుడుగా పని చేశారు. మద్రాస్ టెక్స్టైల్స్ ఇన్స్టిట్యూట్ లో చదివి అక్కడ సూప ర్వైజర్గా పనిచేసారు. 1935లో ఏర్పడిన మద్రాసు రాష్ట్ర చేనేత పారిశ్రామికుల సహకార సంఘంలో ప్రొడక్షన్ ఇన్చార్జిగా ఉద్యోగంలో చేరి సర్కారు జిల్లాల్లో ప్రాథమిక చేనేత సహకార సంఘాలు ఏర్పాటు చేసేందుకు విశేషంగా కృషి చేసారు.

1939లో జరిగిన మద్రాసు రాష్ట్ర కేంద్ర చేనేత సహకార సంఘం ఎన్నికల్లో డైరెక్టర్లుగా చేనేత నాయకులు ఎన్నికయ్యేలా కోటయ్య పథకం రచించి కృతకృత్యులయ్యారు. 1941లో బ్రిటిష్ ప్రభుత్వం దేశవ్యాప్తంగా చేనేతరంగం స్థితిగతులను అధ్యయనం చేసేందుకు థామస్ కమిటీని నియమించగా, కమిటీని కోటయ్య గుంటూరు జిల్లాకు ఆహ్వానించారు. వంద పేజీల వె-ంమొరాండాన్ని ఆ కమిటీకి అందజేశారు. 1942లో చెన్న రాష్ట్ర చేనేత పారిశ్రామిక సంఘాన్ని చైతన్య వంతంగా చేసేందుకు దామెర్ల రమాకాంతరావు అధ్యక్షులుగా, కోటయ్య ప్రధాన కార్యదర్శిగా కృషి చేశారు. నూలు కొరతను అధిగమిం చేందుకు నూలు ధరల స్థిరీకరణ కోసం చేనేత రక్షణ యాత్రలు నడిపారు. చేనేత పారిశ్రామికులకు చాలినంత నూలు సరఫరా చేయాలని, నూలు ధరలు అదుపులో పెట్టాలని, నూలు ఎగుమతులు ఆపాలని నినదిస్తూ కోటయ్య ఆందోళనలు చేపట్టారు. అన్ని జిల్లాల్లో ఆకలియాత్రలు, సత్యాగ్రహాలు పెద్దఎత్తున చేపట్టారు. మద్రాసు నగరంలో 1950 ఏప్రిల్ 16 నుంచి జూన్ 30 వరకు 75 రోజుల పాటు కోటయ్య సత్యాగ్రహం నడిపారు. దాదాపు పది వేల మంది చేనేత కార్మికులు ఈ సత్యాగ్రహంలో పాల్గొన్నారు. 75 రోజుల అనంతరం కేంద్ర పరిశ్రమల శాఖ మంత్రి హరేకృష్ణ మెహతాబ్ మద్రాసు వచ్చారు. చేనేత కాంగ్రెస్ నాయకులతో చర్చలు జరిపారు. మంత్రి ఇచ్చిన హామీలతో సత్యాగ్రహాన్ని విరమించారు. 1952 మద్రాసు శాసనసభ ఎన్నికల్లో కిసాన్ మద్దూర్ ప్రజాపార్టీ అభ్యర్థిగా కోటయ్య చీరాల నియోజ చేనేత వర్గాల ప్రయోజనాల కోసం రేపల్లెలో సత్యా గహం చేపట్టారు. ఫలితంగా కోటయ్య జైలు శిక్ష అనుభవించాల్సివచ్చింది.

రెండున్నర దశాబ్దాలు చట్టసభల్లో సభ్యుడిగా ఉన్న కోటయ్య చేనేతే తన శ్వాస ధ్యాస అన్నట్లుగా జీవించారు. చట్టసభల్లో, బయట వేదికలపై చేనేత వస్త్ర రంగం గురించి ప్రపసంగిస్తుంటే ప్రతి ఒక్కరూ ఆసక్తిగా వినేవారు. కోటయ్య డిమాండ్లు, ప్రతి పాదనలకు భారతదేశ వ్యాప్తంగా ఉన్న చేనేత పారిశ్రామిక వర్గానికి చెందినది అయినందున ప్రతి సభ్యుడూ మద్దతు పలుకుతూ వచ్చారు. చేనేత కార్మికవర్గ ప్రయోజనాల కోసం నిరంతరం అప్రమత్తతతో ఉంటూ వచ్చారు. చేనేతకు సంబంధించి ప్రభుత్వం ఏ నిర్ణయం చేయాలన్నా కోటయ్యను సంప్రదించే చేసేది.

1952లో ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో ప్రకాశం పంతులు స్థాపించిన కృషీకార్ లోక్ పార్టీ ద్వారా శాసన సభ్యునిగా అఖండ విజయం సాధించి, సాధారణ ఎన్నికలలో చీరాల నుంచి శాసన సభ్యునిగా, 1957 నుంచి 1972 వరకు ఎమ్మెల్యేగా, 1974 నుంచి 1980 వరకు ఎమ్మెల్సీగా ఉన్నారు. అనంతరం 1990 నుంచి 1995లో మరణించేంత వరకు రాజ్యసభ సభ్యునిగా ఉన్నారు. 1974 నుంచి 1978 వరకు పీసీసీ ప్రధాన కార్యదర్శిగా పని చేసారు. 1945లో ఏర్పడిన ఆల్ ఇండియా హ్యాండ్లూమ్ వీవర్స్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారు. నిరంతరం ప్రజాజీవితం గడిపిన కోటయ్య అనారోగ్యం కారణంగా 1995 నవంబర్ 26న మరణించారు.

70వ జన్మదినం సందర్భంగా చీరాలలో జరిగిన సభలో ఆనాటి ఉత్తరప్రదేశ్ గవర్నర్ బెజవాడ గోపాలరెడ్డి, కోటయ్య గారికి 'ప్రజాబంధు' బిరుదు నిచ్చి సత్కరించారు. కోటయ్య మరణాంతరం రాష్ట్ర ప్రభుత్వం వెంకటగిరిలోని ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ సంస్థకు ప్రగడ కోటయ్య పేరు పెట్టడం జరిగింది.

**రామ కిష్టయ్య సంగన భట్ల... 9440595494**

## నవ కవిత్వం

# ఎన్నికల నానీలు



ఆ అభ్యర్థి ఓట్లు
నోటాకు సమానం
నోట్లు
పంచలేదు మరి !

ఐదేళ్ళకు ఒక్కసారే
పరిమళిస్తుంది !
కులపుష్పం
ఓ కాగితం పువ్వు

ఒక్క ఓటు
హంగ్‌ని జయించింది
ఓడిన ఓట్ల
విలువెంత?

ఉచితం
అనుచితం
ఉపాధి కల్పన
సముచితం

పోలింగ్ కేంద్రానికి
'హల్క్' వచ్చాడు
పౌరుడు
ఓటరుగా ఎదిగిపోయాడు

రహదారి నాణ్యతే
చూపిస్తుంది,
నీ ఓటుకి
దారి ఏదో !

గంజాయి వనంలో
తులసి మొక్క !
నోటా
కలుపు మొక్కనా ?

'పీల్చే గాలి
ఉచితంగా అందిస్తాం..'
ఓ గడసరి పార్టీ
ఎన్నికల హామీ

మద్యం సీసాపై
పార్టీ గుర్తు !
ఓటరుకి మాత్రమే
కనిపిస్తుంది

– సోమిశెట్టి వేణుగోపాల్
9182584724

## లేఖలు

**ముఖచిత్ర కథనం బాగుంది**


ఈ ఆదివారం అనుబంధంలో మతాలతోనే జాతి సమైక్యత కల సాకారం పేరుతో దివంగత ప్రధాని ఇందిరాగాంధీ జయంతిని పురస్కరించుకుంటూ సాగిన కథనం చాలా బాగుంది. వివిధ సందర్భాలను ప్రత్యక్షంగా కళ్లకు కట్టినట్టు చూపించిన రచయితకు , ప్రచురించిన ఎడిటర్, యాజమాన్యాలకు ధన్యవాదాలు. సందర్భాను సారంగా మన పత్రికలో ప్రత్యేక వ్యాసా లు రాయించి ప్రచురిస్తున్న మీకు, సంపాదక వర్గానికి కృతజ్ఒతలు. తెలుగు భాషపైనా ఓ ప్రత్యేక కాలమ్ నిర్వహిస్తే బాగుం టుంది. భాషను మర చిపోయి బావ దారిద్రంలో ఉన్న వారికి ఉపయోగ పడుతుందని నా మనవి.

**–బి మధుశేఖర్, హైదరాబాద్**

**ఘుమఘుమలు అదురుతున్నాయి**

వారం వారం భాగ్యలక్ష్మి వివిధ రకాలైన వెరైటీ వంటలు రాస్తూ, ఆరో పేజీని ఘుమఘుమలాడి స్తు న్నారు. ఆరోగ్యం, ఆనందం సమ్మి ళితంగా ఆమె చేస్తున్న ప్రయోగా లకు ధన్యవాదా లు. ఆమె నుంచి మరిన్ని కొత్త వంటల రుచులను కోరుకుంటు న్నాం. స్వీట్లు, స్నేక్స్ తయారీలోనూ కొత్త కొత్త రుచులను పరిచయం చేయాలను ఆశిస్తున్నాం.

**– వారాంతపు రజనీ, వరంగల్**




**సినిమా రివ్యూలు బాగున్నాయ్**

వారం వారం విడుదలవుతున్న చిత్రా లలో మంచి చెడ్డలను, నటీ నటులు, సాంకేతిక నిపుణుల పనితీరును అర్థవంతంగా వివరి స్తున్న విశ్లేషకు లకు ధన్యావాదా లు. ప్రధానంగా థియేటర్లలోకి రాకుండా ఓటిటికే పరిమితమవు తున్న సినిమా లపైనా విశ్లేషణలే చేస్తుండటం హర్షించదగ్గది.


**– ముక్కామలపద్మావతి, హైదరాబాద్**
**–శ్రీవల్లి తన్మయ్, హైదరాబాద్,**

**కథలు బాగున్నాయి**

వారం వారం ప్రచురిస్తున్న కథలు బాగున్నాయి కొత్త రచయితలకు మీరందిస్తున్న ప్రోత్సాహం బాగుంది. అలాగే రంకు ధారావాహిక మెచ్చు కోలు గా ఉంది. రచిత కథనా న్ని బాగా నడిపిస్తున్నారు. మంచి రచనలు అందిస్తున్న మీకు ధన్యవా దాలు


**– జి. సర్వేశ్వరరావు, తెనాలి**


# శ్రమ విలువ




కావడి మోస్తే బరువు విలువ
కష్ట పడితే బతుకు విలువ
ఆదమరిస్తే ప్రాణం విలువ
నిరుద్యోగికి ఉద్యోగం విలువ
ఉద్యోగం ఇస్తే డిగ్రీ విలువ
దూరమైతే మనిషి విలువ
చేజారితే క్షణం విలువ
నోరు జారితే మాట విలువ
ఫెయిలైతే ఒక్క మార్కు విలువ
కాలు జారితే మానం విలువ
కాలి నడకలో దూరం విలువ
చెరువు ఎండితే నీటి విలువ
నెలపై పడుకుంటే పరుపు విలువ
చెమట కక్కితేనే శ్రమ విలువ
కరువుకాటకాల్లో వర్షం విలువ
ఎగుసం చేస్తే రైతు విలువ
సాఫల్యతలో జీవితం విలువ
దగ్ధమైతే నిప్పు విలువ
చేయి కాలితే ఉష్ణం విలువ
నీటిలో దూకితే ఈత విలువ
నిరక్షరాస్యుడికి అక్షరం విలువ
నిరు పేదకు మెతుకు విలువ
దీర్ఘ రోగికి ఆరోగ్యం విలువ
కవికి కవన వస్తువు విలువ
దెబ్బ తగిలితే నొప్పి విలువ
చేజారి పగిలితే అద్దం విలువ
విస్ఫోటనంలో శాంతి విలువ
కలానికి సిరా చుక్క విలువ
పుస్తకానికి విజ్ఞానం విలువ
అవగతం విలువల విలువలు !

**మధుపాలీ**
**9949700037**



(గమనిక: వ్యక్తిగత జాతకము అనగా వ్యక్తి పుట్టి నపుడు అతని సమయం, స్థలం, జన్మ వివరాలు ఆధారముగా నిర్మించిన జన్మకుండలి ప్రకారము వ్యక్తికి నడుస్తున్న దశలు, అంతర్దశలు ప్రధానము. గోచారం ఫలితాలు చూసుకునేటప్పుడు ప్రధానముగా వ్యక్తిగత జాతకము లోని దశ అంతర్దశలు కూడా కలిపి చూసుకోవాలి. గోచార రీత్యా రాశి ఫలాలు అశుభము గా ఉండి దోషాలు ఉన్నప్పటికీ, జననకాల దశ ఫలములు శుభము గా ఉంటే రాశి ప్రస్తుత అశుభ ఫలితాలు స్వల్పంగానే ఉంటాయి. చిన్న చిన్న పరిహారాలు పాటించి శుభ ఫలితాలు పొందగలరు)

నిర్వహణ :
స్వర్ణకంకణ సన్మానిత,
జ్యోతిష్య చూడామణి,
జ్యోతిర్వాస్తు ప్రజ్ఞా విశారద
డా॥ఈడ్పుగంటి
పద్మజారాణి
91 9849250852,
91 7506976164
padma.suryapaper@gmail.com



# 17.12.2023 నుంచి 23.12.2023 వరకు



## మేష రాశి

అశ్విని 1,2,3,4 పాదములు , భరణి 1,2,3,4 పాదములు కృత్తిక 1వ పాదము

ప్రారంభంలో ఎక్కువ కష్టపడకుండానే ఆశించిన విజయాలను అందుకుంటారు. విదేశాలలో ఉండే చిన్ననాటి మిత్రులుతో కమ్యూనికేషన్ బాగుంటుంది. సంతానానికి సంబంధించి నూతన నిర్ణయాలు తీసుకుంటారు. వాతావరణము చాలా అనుకూలంగా ఉంటుంది . మీరు అనుకున్నట్టుగా ప్రణాళికా పరంగా పనులు ముందుకు వెళ్లిపోతాయి. తండ్రి గారి ఆఫీసులో అందుకుంటారు. వారం మధ్యలో పుణ్యక్షేత్ర సందర్శన, ఆకస్మిక ఖర్చులు, ప్రణాళిక లేకుండా చేయవలసి వచ్చిన ప్రయాణాలు కొంత మానసిక ఇబ్బందికి గురిచేస్తాయి. వాటిని అవలీలగా అధిగమించి ముందుకు వెళ్ళిపోతారు. నిర్ణయాలు బాగుంటాయి నాయకత్వ లక్షణాలు పెరుగుతాయి మనసులో అనుకున్న కోరికలు నెరవేరుతాయి ఉత్సాహంగా ఉల్లాసంగా నిర్ణయాలు తీసుకుంటారు.



## వృషభరాశి

కృత్తిక 2,3,4 పాదములు ,రోహిణి 1,2,3,4 పాదములు మృగశిర 1,2 పాదములు

ప్రారంభంలో భూ సంబంధ అంశముల గురించి, నూతన పెట్టుబడుల కొరకు ఆలోచనలు. వృత్తిలో అదనపు బాధ్యతలు శ్రమ, రావలసిన ధనములో ఆలస్యాలు. అయినప్పటికీ దూర ప్రదేశాల్లో ఉండే ఆత్మీయుల ద్వారా ఆదాయము అభివృద్ధి, వారము మధ్యలో దేవాలయాల సందర్శన, చిన్ననాటి మిత్రుల సమావేశాలు, ముఖ్య విషయాల చర్చలు, ఆధ్యాత్మిక ప్రసంగాలలో పాల్గొనుట. వారాంతములో బంధువుల రాక ఆకస్మిక ఖర్చులు, ఒత్తిడి, శ్రమ. ఇష్టమైన వస్తువుల కొరకు అధికంగా ఖర్చు పెట్టుట. జీవిత భాగస్వామితో చర్చించి వృత్తిపరంగా నూతన పథకాలు. పౌరుషం పెరుగుతుంది నాయకత్వ లక్షణాలు పెరుగుతాయి నిర్ణయాలు చాలా త్వరితంగా తీసుకుంటారు వృత్తిలో అధికారం పెరుగుతుంది.



## మిధున రాశి

మృగశిర 3,4 పాదములు, ఆరుద్ర 1,2,3,4 పాదములు పునర్వసు 1,2,3 పాదములు

వారం ప్రారంభంలోతండ్రిగారితో అభిప్రాయ బేధాలు రాకుండా జాగ్రత్త వహించాలి. జీవిత భాగ స్వామికి వృత్తి పరమైన ఒత్తిడి. విదేశీ ప్రయాణాల కోసం ప్రయత్నాలు గట్టిగా చేస్తారు. అసంతృప్తిని అధిగమించడానికి పుణ్యబలాన్ని పెంచుకోవాలి. చేస్తున్న వృత్తిలో కొత్త వ్యక్తుల, జోక్యము సలహాలు ఇబ్బంది కలిగిస్తాయి. ప్రశాంతత లోపిస్తుంది. వారము చివరిలో ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న పనులు ముందుకు సాగుతాయి. ముఖ్య వ్యక్తుల సహకారము, జీవిత భాగస్వామి ఆదాయం అభివృద్ధి. గుర్తింపు గౌరవము చేసిన శ్రమకు. కంటి విషయంలో శ్రద్ధ తీసుకోవాలి. ట్యాక్స్ చెల్లిస్తారు. దీర్ఘకాలికి పెట్టుబడులకై ఆలోచనలు సాగిస్తారు. భాగస్వామికి వృత్తిపరంగా స్థానచలన మనకు అవకాశం.



## కర్కాటక రాశి

పునర్వసు 4వ పాదము పుష్యమి 1,2,3,4 పాదములు ఆశ్లేష 1,2,3,4 పాదములు

వారం ప్రారంభంలో ఆరోగ్యం పై శ్రద్ధ అవసరము ముఖ్యమైన పనులలో ఆలస్యాలు, ఆటంకములు. ప్రయాణములలో జాగ్రత్త అవసరము. ఆకస్మిక నిర్ణయములు తాత్కాలికంగా వాయిదా వేయడం మంచిది. చారిత్రాత్మక ప్రదేశాలు సందర్శించడానికి ఆసక్తి. భాగస్వానికి వృత్తిలో ఆదాయ అభివృద్ధి, ప్రమోషన్, స్త్రీ సంతానానికి సంబంధించి విద్య, వృత్తి అభివృద్ధి మరియు వారి వివాహమునకై మీరు ప్రయత్నాలు కొంతవరకు ఒక కొలిక్కి వస్తాయి. తల్లితండ్రుల ఆశీస్సులతో నూతన ప్రణాళికలు చేయబడతారు. ఆదాయం అభివృద్ధి. సృజనాత్మకమైన మీ ఆలోచనలు అనుకూలంగా ఉంటాయి. వృత్తిపరంగా కొత్త అవకాశాలకి ప్రయత్నాలు కొంత ముందుకు వెళతాయి. శివాలయ సందర్శన మేలు శ్రమకి తగ్గిన గుర్తింపు గౌరవం లభిస్తుంది. సంఘములో



## సింహ రాశి

మఖ 1,2,3,4 పాదములు, పుబ్బ 1,2,3,4 పాదములు ఉత్తర 1వ పాదము

కీర్తి ప్రతిష్టలు పెరుగుతాయి. ఉన్నతమైన ఆలోచనలతో వారం ప్రారంభమవుతుంది. సంతానము అభివృద్ధి పరంగా ముందుకు సాగుతుంది. వారి కీర్తి ప్రతిష్టలు పెరుగుతాయి. వారము మధ్యలో ఆరోగ్య విషయంలో ప్రత్యేక శ్రద్ధ అవసరము. ముఖ్యమైన నిర్ణయాలు ఆచితూచి అడుగు వేయాలి. సంతానము తమ కొత్త పెట్టుబడులు పెట్టేటప్పుడు తొందరపాటు పనికిరాదు. వారము చివరిలో వృత్తిలో అభివృద్ధి. తోటి వ్యక్తులు ఈర్షతో ఇబ్బంది పెట్టే అవకాశములు. భాగస్వామికి వృత్తి పరంగా నూతన అవకాశములు. మేనేజ్మెంట్, అడ్మినిస్ట్రేషన్, విద్యార్థులకు అనుకూలం. విదేశీ విద్య కొరకు ప్రయత్నాలు కొంతమేర అనుకూలంగా ఉంటాయి. దత్తాత్రేయ మందిరాల సందర్శన మేలు



## కన్యా రాశి

ఉత్తర 2,3,4 పాదములు, హస్త 1,2,3,4 పాదములు చిత్త 1,2 పాదములు

వారం ప్రారంభంశత్రువులపై విజయాన్ని సాధిస్తారు. ఒక సలహా కొరకు ముఖ్య బంధువులను కలుస్తారు. ఆరోగ్య పరంగా బాగుంటుంది. రుణములు చెల్లించుటలో ప్రణాళికా పరముగా వెడతారు. ఆత్మస్థైర్యంతోను కొత్త ఆలోచనలతోనూ ప్రారంభిస్తారు. ప్రస్తుతము ఉన్న వృత్తిలో భాగస్వాములతో వృత్తికి సంబంధించి నూతన పథకాలను ప్రవేశపెట్టడానికి నిర్ణయాలు తీసుకుంటారు. తల్లి గారికి ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. పుణ్యక్షేత్ర సందర్శనలు దగ్గర ప్రయాణాలు లాంటివి చేస్తారు. వారి ఆరోగ్య విషయంలో శ్రద్ధ తీసుకుంటారు. వారం మధ్యలో వాదనలకు దూరంగా ఉండటం మంచిది. కొత్త వ్యక్తులతో మెలిగేటప్పుడు ఆచితూచి అడుగు వేయాలి. ముఖ్యమైన నిర్ణయాల విషయంలోనూ, ఆరోగ్య విషయంలోనూ తొందర పాటు పనికిరాదు.



## తులారాశి

చిత్త 3,4 పాదములు స్వాతి 1,2,3,4 పాదములు , విశాఖ 1,2,3 పాదములు

వారం ప్రారంభంలో తెలియని చికాకు ఆందోళన. ముఖ్యమైన నిర్ణయాలు తీసుకోలేక సతమతమవుతారు. ఆలోచనలు కొంచెం మందకొడిగా సాగుతాయి. తోబుట్టువుల సహకారాన్ని కోరుకుంటారు. రావలసిన రుణములు ఆలస్యాలు, చిన్నపాటి అనారోగ్యాలు విసుగు తెప్పిస్తాయి. బంధువులలో కొందరి ప్రవర్తన ఇబ్బంది కలిగిస్తుంది. వారము మధ్యలో మిత్రులతో కలిసి విహారయాత్ర లాంటి వాటికి వెళ్ళుటకు ఆసక్తి. గుర్తింపు గౌరవాన్ని పొందుతారు సాంఘిక సంబంధాలు బలపడతాయి. వారం చివరిలో ముఖ్యమైన పనులు వాయిదా పడతాయి, దీర్ఘకాలికి పెట్టుబడులు పెట్టడానికి, నూతన ప్రయాణాలకి కొత్త ఆలోచనలు. వృత్తిలో అధికారులతో పేచీలు రాకుండా జాగ్రత్త పడుతూ ముందుకు వెళ్లాలి.



## వృశ్చిక రాశి

విశాఖ 4 పాదము అనురాధ 1,2,3,4 పాదములు, జ్యేష్ఠ 1,2,3,4 పాదములు

ప్రారంభములో ఉద్వేగాలు అధికంగా ఉంటాయి. డ్రైవింగ్ విషయంలో జాగ్రత్త వహించాలి. వ్యవసాయానికి సంబంధించిన విషయాల మీద దృష్టి సారిస్తారు. కొత్త ప్రదేశాలను సందర్శించినప్పుడు ఆహార స్వీకరణ మీద శ్రద్ధ వహించుట మేలు. గృహములో వాతావరణము ప్రశాంతత తక్కువ. నూతన అంశాలు తెలుసుకుంటారు విద్యా పరంగా కొత్త జ్ఞానాన్నిపెంచుకుంటారు. విద్యార్థులకు విద్యాపరంగా శ్రద్ధ అధికము చేయాలి. జ్ఞాపక శక్తిని పెంచుకునే విధంగా కృషి చేయాలి. అనవసర ఖర్చులను అదుపు చేసుకోవాలి. ఆధ్యాత్మికంగా కృషి చేస్తున్న ఆత్మీయులను కలుస్తారు. వారము మధ్యలో ధైర్యం పెరుగుతుంది. తగిన గుర్తింపు గౌరవం లభిస్తుంది. ఆత్మ విశ్వాసం పెరుగుతుంది పోటీలలో నెగ్గుతారు .



## ధనస్సు రాశి

మూల 1,2,3,4 పాదములు పూర్వాషాఢ 1,2,3,4 పాదములు ఉత్తరషాఢ 1వ పాదము

వారం ప్రారంభములో ఎవరికైనా ధనముని రుణముగా ఇచ్చే విషయంలో జాగ్రత్త వహించాలి. ఆత్మవిశ్వాసం పెరుగుతుంది ధైర్యంగా నిర్ణయాలు తీసుకుంటారు తోబుట్టువులు సహకరిస్తారు చిన్నపాటి ప్రయాణాలకు అవకాశం. ఇంతకుముందు వాయిదా పడిన ముఖ్యమైన పనులు కొంతవరకు ముందుకు సాగుతాయి. వారం మధ్యలో నూతన అంశాలు నేర్చుకుంటారు యోగ మెడిటేషన్ వంటి వాటి మీద శ్రద్ధ చూపిస్తారు ఆరోగ్య విషయంలో. ఎన్ని పనులున్నప్పటికీ ఆహారాన్ని సమయానికి తీసుకోవటమేలు. చాలా కాలానికి కలిసిన ఆత్మీయ వ్యక్తుల మధ్య మాట పట్టింపులు లేకుండా నిర్ణయాలు తీసుకొనుట మంచిది. వృత్తిలో నాయకత్వం, గౌరవము బాధ్యతలు పెరుగుతాయి. ఇబ్బంది పెట్టే వ్యక్తుల మీద విజయాన్ని సాధిస్తారు.



## మకర రాశి

ఉత్తరషాఢ 2,3,4 పాదములు, శ్రవణం 1,2,3,4 పాదములు ధనిష్ఠ 1,2 పాదములు

వారం ప్రారంభంలో ఇతర వ్యక్తులతో మాట్లాడేటప్పుడు కమ్యూనికేషన్ సమస్యలు లేకుండా జాగ్రత్తగా వ్యవహరించడం మేలు.ఆర్థిక విషయాలలో, కుటుంబ విషయాలలో కొంత చికాకులు. వారం మధ్యలో దగ్గర ప్రయాణంలో, నూతన వ్యక్తుల పరిచయాలలో జాగ్రత్తలు తీసుకోవాలి. ఆత్మవిశ్వాసం పెంచుకోవాలి. విద్యార్థులకు హాస్టల్లో సీటు కొరకు ప్రయత్నాలు, ఆసక్తిగా నూతన విద్యలు నేర్చుకుంటారు. వారం చివరిలో సంతానమునకు విద్య సంబంధించిన ఖర్చులు, వారి అభివృద్ధి కొరకు మీరు తీసుకునే నిర్ణయాలు, దీర్ఘకాలిక పెట్టుబడులకై ఆలోచనలు, పలుకుబడి కలిగిన మిత్రుల సహకారం, సోదర వర్గంతో సమావేశాలు. చేస్తున్న ముఖ్యమైన పనులు ఆటంకములు లేకుండా దగ్గరిలోని నవగ్రహ దేవాలయ సందర్శన మేలు.



## కుంభ రాశి

ధనిష్ఠ 3,4 పాదములు శతభిషం 1,2,3,4 పాదములు, పూర్వాభాద్ర 1,2,3 పాదములు

వారం ప్రారంభంలో వ్యక్తిగత అంశముల పై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటారు. మనసులోని కోరికలు నెరవేరుతాయి.మనసు ఉల్లాసంగా, ఉత్సాహంగా ఉంటుంది కీర్తి ప్రతిష్టలు పెరు గుతాయి మీరు చేసిన సేవలకు గుర్తింపు లభిస్తుంది. వారం మధ్యలో,వాదనలకు దూరంగా ఉండాలి, ఇతరుల ప్రవర్తన పై కోపాన్ని కంట్రోల్ చేసుకోవాలి. ఆర్థిక విషయాల్లో కొంత చికాకుగా ఉంటుంది. మిత్రులు సమయానికి సహకరిస్తారు. ముఖ్య సమావేశాల్లో పాల్గొంటారు.కుటుంబంలోని ముఖ్య విషయాలలో సంబంధం లేని వారి జోక్యం చికాకును తెప్పిస్తుంది ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న ముఖ్య వార్త దూర ప్రదేశాన్నుంచి అందుకుంటారు. గవర్నమెంట్ కి సంబంధించిన పన్నులు చెల్లిస్తారు. నూతన గృహ నిర్మాణమునకు, ఖరీదైన వాహనం కొరకు ప్రయత్నాలు చేస్తారు.



## మీనరాశి

పూర్వాభాద్ర 4 వ పాదము ఉత్తరాభాద్ర 1,2,3,4 పాదములు రేవతి 1,2,3,4 పాదములు

వారం ప్రారంభంలోఆరోగ్యం కొరకు శ్రద్ధ. మానసికంగానూ తగిన విశ్రాంతి అవసరము.వృత్తిలో శ్రమ ఒత్తిడి, ప్రయాణాలలో అలసట. తండ్రితో పెద్దలతో అభిప్రాయ వేదములు రాకుండా జాగ్రత్తగా ఉండాలి. ఆర్థిక అంశాలలో తోబుట్టువులు సమయానికి సహకరిస్తారు. వారం మధ్యలో వృత్తిపరమైన ఆకస్మిక ప్రయాణాలు. వారం చివరిలో విదేశీ అవకాశంలో కొరకు కృషి చేస్తారు. దూరంగా ఉన్న తోబుట్టువుల నుంచి ఆకస్మిక చిన్న బహుమానాలు మనసు ప్రశాంతత తక్కువగా ఉండటం వల్ల ఆధ్యాత్మిక క్షేత్ర సందర్శనకై ఆలోచనలు. కమ్యూనికేషన్ బాగుంటుందివృత్తిలో గౌరవాన్ని, అభివృద్ధిని పొందుతారు నాయకత్వ లక్షణాలు పెరుగుతాయి అనుకున్న సమయంలో అనుకున్న పనులు పూర్తి చేస్తారు.

# దేవుడి భార్య



## సరికొత్త సీరియల్

**(గతవారం తరువాయి)**

స్త్రీలకు ప్రాణం పోయినా ఫర్వాలేదు కాని మానం పోకూడదు. ఎంత చెత్త సామెత? 'పురుషులకు మానం ఉండదు మరి స్త్రీలకే ఎందుకు? పురుషాగం వీరత్వానికి ప్రతీక మరి మర్మాంగం?'

'ఏమే? ఎవడైనా పోటు వేసి పోయినాడా? లేదంటే నువ్వే పోటు వేయించుకున్నావా?'

భర్త మాటలు విన్న బీవి ముఖంలో ఎలాంటి స్పందన లేదు. పెళ్లి అయినప్పటి నుండి అలాంటి మాటలు ఎన్నో వినింది, వినడం అలవాటు చేసుకుంది. అప్పట్లో చలించేది, బాధపడేది, ఏడ్చేది. ఈ మధ్య అలాంటివి లేవు. ఉన్నా లాభం లేదనుకుంది. బిడ్డల భవిష్యత్తు గురించి మాత్రమే ఆలోచించడం తన ఉద్యోగం అయ్యింది.

అలాంటి స్థితిలో తనను చూసిన మస్తాన్ ప్రేమగా మాట్లాడాలని, ఆతృతగా దగ్గరకు తీసుకోవాలని, గాబరా పడుతూ ఏమైంది? ఎలా ఉన్నావని అడగాలని? ఆశ పడింది. ప్రపంచంలో బీవిలా ఎంత మంది ఆశ పడుతున్నారో?! ఆ కలలన్నీ నిజం అవుతాయా? స్త్రీలు తమ భర్తల నుండి అటువంటి ప్రేమను, ఆప్యాయతను, అనురాగాన్ని పొందగలరా?.

**

లేచి ఎనుములను తోలింది. మౌనంగా కదిలాయి, వర్షం పడిన తర్వాత మట్టి పరిమళంలా కదిలాయి, చల్లని గాలిలా కదిలాయి.

మస్తాన్ కి కోపం, ఆవేశం, కొవ్వు, మదం, అహంకారం తన మాటలకు సమాధానం చెప్పని భార్యపై కదిలించినా, విదిలించినా, కొట్టినా, తన్నినా కదలని ఎనుములపై. తట్టుకోలేకపోయాడు, ఉండబట్టలేకపోయాడు, ప్రతీకారం తీర్చుకోవాలనుకున్నాడు, తనను బేఖాతరు చేస్తున్నారని భావించాడు. నడిరోడ్డు మీదే భార్యను తన్నాడు. కిందపడింది, అమ్మా అని అరిచింది, అరుపు కాదు బాధ. అమ్మా! అని అరిచిన అరుపును ఎనుములు విన్నాయి, బాధపడ్డాయి.

'మూగరోదన' ఎనుములది, బీవిది.

'పెద్ద కట్టెను తీసుకొని ఎనుములను బాదాడు, కొట్టాడు, తన్నాడు.'

'భార్య చీరను లాగుతూ చెప్పవే.. చెప్పు.. ఎవడు వాడు? ఎప్పటి నుండి సాగుతోంది?'

బీవి సహనాన్ని కోల్పోలేదు. ఎందుకంటే? తన మెడలో తాళి కట్టిన భర్త కనుక, అతను లేకపోతే గాజులు ఉండవు, బొట్టు ఉండదు.

పనికిమాలినవి ఎన్నో ఉండవని భయం, బాధ. భర్త లేకపోయినా అవన్నీ వేసుకోవచ్చని, వేసుకోడానికి ధైర్యం చేస్తే సరిపోయేది.

ఎనుములు మాత్రం మస్తాన్ ని పరిగెత్తించాయి, ఎత్తి కుమ్మాయి. మస్తాన్ పెత్తనాన్ని సహించలేకపోయాయి. తమ మెడలో తాళి లేదని గ్రహించాయి. ఎనుముల్లో ఎంతటి తిరుగుబాటు, ఎంతటి పోరాటం, ఎంతటి విప్లవం, ఎంతటి చైతన్యం.

బీవిలో లేకపోవడం దారుణం, అన్యాయం, మూర త్వం, అమాయకత్వం, చేతకానితనం, ధైర్యం చేయలేకపోవడం, నిస్సహాయత. స్త్రీలు జయించాలి, ఎదిరించాలి, ఉగ్రరూపం దాల్చాలి.

ఏమే? దొమ్మరిముండ ఎనుములను నాపై తోలుతావా? నన్ను చంపడానికి ఉసిగొల్పుతావా? నిన్ను వదలను ముక్కలు ముక్కలు చేస్తా, కోసి కారం పెడతా అంటూ గట్టిగా వదురుకుంటూ ఇంటికి పరిగెత్తాడు. తాను చేయలేని పని ఎనుములు చేసినందుకు ఆనందపడింది, మనసు కుదుటపడింది, భర్తకు దెబ్బలు తగిలాయేమోనని బాధపడింది.

దెబ్బలు తగిలితే తానే సుబ్బారెడ్డి దగ్గరకు తీసుకెళ్లాలి, మందు ఇప్పించాలి దానికి ఖర్చు అవుతుంది. సుబ్బారెడ్డి గాడు చిన్నదాన్ని కూడా పెద్దది చేసి చెపుతాడు, మందులకు ఎక్కువ డబ్బులు తీసుకుంటాడు, గవర్నమెంటు ఆసుపత్రికి వెళ్ళాలంటే ఒకరోజు పని వదులుకోవాలని భయపడింది. భర్తకు ఏం కాకూడదని లేని దేవుడిని మొక్కుకుంది.

పెద్దగా దెబ్బలేం తగలలేదు కానీ అక్కడక్కడ మూగదెబ్బలు తగిలాయి. దెబ్బలకు తట్టుకోలేక సన్నని జ్వరం కాసింది. ఎనుముల జోలుకు వెళ్ళకూడదనుకున్నాడు కాని వాటిని చంపాలన్నంత పగ పెంచుకున్నాడు. అవకాశం దొరికితే చంపాలనుకున్నాడు.

పశువులను పెంచుకుంటూ పాలు, పెరుగు అమ్ముకుంటూ వచ్చిన డబ్బుతోనే కుటుంబాన్ని నెట్టుకు వస్తోంది బీవి. తల్లిదండ్రులు పిల్లప్పుడే చనిపోవడంతో మేనమామ దగ్గరకు తీసుకున్నాడు. ఎంత దగ్గరకు అంటే పడక గది వరకు. బీవికి, మస్తాన్ కి ముప్పై సంవత్సరాల వ్యత్యాసం ఉంది. బీవి పెద్ద మనిషి అయినప్పటి నుండే బుగ్గలను నిమిరాడు, వీపుపై చేతులేసి రుద్దాడు, పెదవులను నలిపాడు, అనేక అంతర్గత శారీర భాగాలను కొరికాడు, గిల్లాడు, కామాన్ని తీర్చుకున్నాడు. పెంచిన విషయం మరిచాడు. పెళ్లి కాకపోవడం, ఒంటరిగా ఉండటం, కామాన్ని అదుపు చేసుకోలేకపోవడంతో తన కోరికలను తీర్చుకోడానికి బీవి శరీరాన్ని ఉపయోగించుకున్నాడు.

అందరికి తెలిసేలా పెళ్లి చేసుకోలేదు. పడకగదిలో భార్యవని చెప్పాడు. తల ఊపింది. సంత నుండి నల్లపూసల దండ తెచ్చాడు. మెడలో వేసుకుంది. అప్పటి నుండిభార్యగా చలామణి అయ్యింది, అవుతూనే ఉంది.

పులివెందుల చుట్టు పక్కల ఉన్నా నలపురెడ్డిపల్లె, అంబకపల్లె, చిన్నకూడాల, పెద్ద కూడాల, వేముల, అంకాలమ్మగూడూరు లాంటి పల్లెలకు పోయి నాటు కోళ్లు తెచ్చి పులివెందులలో అమ్మడం, పులివెందుల లైన్స్ క్లబ్బులో పేకాట ఆడటం, వంకబడి దగ్గర పాడుబడిన తగ్గు మిద్దెలో దొంగసారా అమ్మడం లాంటివి చేసి డబ్బు సంపాదించేవాడు మస్తాన్.

సంపాదనను ఇంట్లో మాత్రం ఇవ్వడు. సారాలో సంపాదించింది కోళ్ల పంద్యాలకు, కోళ్ల పంద్యాలో సంపాదించింది పేకాటకు పెట్టేవాడు. ఊరంతా చిన్నాచితక అప్పులు చేయడంతో మస్తాన్ ని ఎవరూ నమ్మడం లేదు. ఇప్పుడు పనేమీ చేయడం లేదు. బీవి పశువులను పెంచుతోంది. పశువులు.. బీవిని, పిల్లలను, మస్తాన్ అనే పశువును కూడా భరిస్తున్నాయి, భరించి పెంచుతున్నాయి.

ఐదు ఎనుములు, మూడు దున్నపోతులను పెంచుతోంది బీవి. వాస్తవానికి దున్నపోతులు ఉండేది రెండే తన కళ్లకు మస్తాన్ కూడా దున్నపోతు మాదిరే కనపడతాడు. కడుపుకు అన్నం లేకపోయినా మీసాలకు సంపంగి నూనె అన్నట్టుగా మస్తాన్ తాగుబోతు, తిరుగుబోతే కాదు ఊరికి పెద్ద మనిషిలా చలామణి అవుతున్నాడు కూడా.

పెద్ద మనిషిలా చలామణి కావడానికి పెద్ద కారణాలు అవసరం లేదు. వయసులో పెద్దవాడని కొందరు, తమ పిల్లలను చెరుస్తాడని భయంతో కొందరు, ఊళ్లో జాతర, తిరుణాల జరిపించడానికి కాస్తో కూస్తో డబ్బులిస్తాడని కొందరు, ఉతికిన బట్టలు వేసుకొని పెద్దోడిలా కనపడతాడని కొందరు. అలా అనేక కారణాలు ఉండటంతో ఊళ్లో పెద్ద మనిషిగా చలామణి అవుతున్నాడు.

అప్పుడంటే అంతో ఇంతో సంపాదిస్తున్నాడు కనుక ఊళ్లో జరిగే ఉత్సవాలకు డబ్బు ఇచ్చేవాడు. ఇప్పుడు తానే పశువుల మీద, భార్య మీద ఆధారపడి బతుకుతున్నాడు. అందుకే ఊళ్లో పెద్ద మనిషి హోదాను కొద్ది కొద్దిగా కోల్పోవాల్సి వచ్చింది.

భార్యను కొడతాడని, సరిగా చూసుకోడనే కారణాలతో మాత్రం తన పెద్ద మనిషి హోదాను కోల్పోవడం లేదు. ఎందుకంటే భార్యను కొట్టడం, హింసించడం, బెదిరించడం, తన్నడం, బాదటం, రక్కడం, గుద్దడం, పొడవడం లాంటివి సర్వసాధారణం. అందరూ చేసేవే. అవి పెద్ద తప్పులేమి కాదు. మగవాడి లక్షణం, అధికారం. వాటిని పట్టించుకోవాల్సిన అవసరం లేదు.

ఊళ్లో జాతర జరుపుతున్నారని జాతర తేదీలను దండోరా వేసి చెప్పాడు మాదిగ మల్లన. దండోరా వేసిన తర్వాత ప్రజలు ఊరు దాటి వెళ్లకూడదు. ఆడపిల్లలను ఇంటికి పిలుచుకోవాలి. పండగకు యాటలు, కోళ్లు కోసి అల్లుళ్లకు మర్యాద చేయాలి. బట్టలు పెట్టి పంపడం అలవాటు, సంప్రదాయం, సంస్కృతీ.

ఏదో ఒక సాకుతో అల్లుళ్లను సాకుతుండాలి. ఏదో ఒకటి ఇస్తుండాలి. లేదంటే అలుగుతారు, భార్యలను దెప్పిపొడుస్తారు. అందుకే అత్తమామలు ఎంత బీదవారైన అల్లుళ్లకు కానుకలు ఇస్తూనే ఉంటారు. తమకు లేకపోయినా వాళ్లకు పెడతారు, వాళ్లు తినకపోయినా అల్లుళ్లను పశువులను మేపినట్లు మేపుతారు. అల్లుళ్లు అత్తగారింటి పరిస్థితిని అర్థం చేసుకోరు, చేసుకోవాల్సిన అవసరం లేదని వాళ్ల అభిప్రాయం.

కులాలకు, మతాలకు సంబంధం లేకుండా పులివెందుల ప్రజలందరూ జాతర చేసుకుంటారు. ఆ దండోరా బీవి గుండెల్లో గునపంలా దిగింది. ఆ దండోరా బీవి కంట్లో సముద్రంలా పొంగింది. ఆ దండోరా బీవిని బాధపెట్టింది, భయపెట్టింది.

***

ఊరంతా జాతర హడావిడిలో మునిగిపోయింది. గడపలు పసుపు పూసుకున్నాయి. వాకిళ్లు తోరణాలతో స్నేహం చేశాయి. ఇంటి ముందు మేకలు, పొట్టేళ్ళు, ఎనుములు, ఎద్దులు మేత మేస్తున్నాయి. మరో రెండు రోజుల్లో అవి మనుషుల పంటి కింద నమలబడతాయి. వాటి రక్తం అమ్మవారి దాహాన్ని తీరుస్తుంది. రక్తాన్ని తాగేది అమ్మవారు ఎలా అవుతుంది? అవుతుందని కొందరు, కాదు.. కాలేదని మరికొందరు గొడవపడతారు. గొడవ తెగదు, తెల్లవారదు.

అల్లుళ్లను ఇంట్లో పడుకోబెట్టి ఇంటివారు బయట పడుకున్నారు. అల్లుడు ఇంటికి వస్తే సర్దుకోవాలి, అల్లుడికి చాకిరీ చేయాలి, తాము సద్దిబువ్వ తిని అల్లుడికి మాంసం వండాలి. అల్లుడు బాగుండాలి, ఎలాంటి ఇబ్బంది కలగకూడదు. కలిగితే అత్తగారింటిలో బిడ్డకు అవమానం, హేళన, నీచపు మాటలు.

నా బిడ్డ ఇంటికి వస్తే కనీసం పడుకోడానికి సౌకర్యం లేదని, యాట కోసే దిక్కు దివాణం లేదులే కనీసం కోడి పీకైనా తెగాలి కదా! పాడు కొంపకు ఇచ్చి నా కొడుకుకు అన్యాయం చేశానని అత్త ఇంతెత్తు లేస్తుంది. అందుకే అల్లుళ్లను పసి పిల్లోళ్ల మాదిరి చూసుకోవడం ఊరి రివాజు. ఆ ఊరేనా?! ఎక్కడైనా అంతేనేమో!.

గుడి ముందు పందిరి లేచింది. గుడిలో ప్రత్యేక పూజలు మొదలయ్యాయి. ప్రత్యేక పూజలకు బీదవారికి అనుమతి ఉండదు. టికెట్ కొనాలి, పూజకు ఏవేవో సామాన్లు సమకూర్చాలి. రెండు నుండి ఐదు వందల వరకు ఖర్చు అవుతుంది. ప్రత్యేక పూజలో అమ్మవారిని దగ్గర నుండి దర్శించుకోవచ్చు. అమ్మవారి ఆశీస్సులు నిండుగా, దొరుకుతాయి.

అమ్మవారిని రకరకాల వేషాల్లో ముస్తాబు చేశారు. కొందరు అమ్మవారిని గుర్తుపట్టారు, మరి కొందరు గుర్తు పట్టలేకపోయారు. గుడి మొత్తం లైట్లతో వెలిగిపోయింది. గుడి లైట్లతో వెలగాలంటే ఎన్ని గుడిసెల్లో లైట్లు ఆరిపోవాలో!.

అభిషేకాలు, నైవేద్యాలు, తప్పెట్లతో తాళాలతో అమ్మవారికి మొక్కులు చెల్లించుకునేవారు చెల్లించుకుంటున్నారు. రెండు చేతుల్లో యాపమండలను తీసుకొని పూనకంతో ఎగురుతున్నారు. అప్పుడప్పుడు యాపాకును తినడం, నాలుక బయటకు తీసి అరవడం, నిమ్మకాయను నమలడం చేశారు. మరికొందరు యాటలు కోస్తున్నారు, పూనకం వచ్చిన వారిలో కొందరు ఆ రక్తాన్ని సప్పరిస్తున్నారు, కొందరు నెత్తిపై చల్లుకుంటున్నారు, కొందరు రక్తాన్ని చూసి స్పృహ కోల్పోయారు.

అరుపులు, కేకలు, మూగజీవాల రోదనలో పూజారి చదివే మంత్రాలు వినపడటం లేదు. వినపడినా ఆ మంత్రాలు అర్థం కావు. అర్థం అవ్వాల్సిన అవసరం లేదని కొందరు, అర్థం చేసుకోడానికి ప్రయత్నిస్తున్నవారు కొందరు, అసలు పూజారి మంత్రాలు చదవడని ఊరికే గొణుగుతాడని కొందరు. ఇలా రకరకాల ఆలోచనలు, రకరకాల కోరికలు, అభ్యర్థనలు, అర్జీలు.అమ్మవారిని ప్రసన్నం చేసుకోడానికి పూజారి చేతికి పదో, పాతికో పెట్టి ప్రత్యేకంగా గుర్తించమని కొందరు విన్నవించుకున్నారు.

పూజారి మెడలో దండ వేసి, బట్టలు పెట్టి కాళ్లపై పడ్డారు.

హారతి పళ్ళెంలో చిల్లర వేసినోళ్లకు పువ్వును, నోటు వేసిన వాళ్లకు టెంకాయ చిప్పను అందించడం పూజారి ఆచరించే పద్ధతి.

గుంపులో కొందరికి బొట్టు పెడతాడు, ఇంకొందరి వైపు తదేకంగా చూసి పిడికెడు పూలు తీసుకొని విసిరికొడతాడు, కొందరికి ఎక్కువసేపు శఠగోపం పెట్టి కళ్ళు మూసుకొని ఏదో చదువుతాడు, చదివినట్టు నటిస్తాడు. అది నటన అని కొందరికి తెలుసు, మరికొందరికి తెలియదు, కొందరు వింతగా చూస్తారు, మరికొందరు మహాప్రసాదంలా భావిస్తారు, ఇంకొందరు అసహ్యంగా ముఖం తిప్పుకుంటారు.

**(మిగతా వచ్చేవారం)**



**రచన : జానీ తక్కెడసిలా**
**7259511956**

## బైజూస్ పతనం.....! ఎన్నో పాఠాలు...ఒక గుణపాఠం!

# అలెగ్జాండర్ సింద్రోం??

ఒక వ్యాపారంలో విజయం చూడగానే ఇక ఆ రంగం మొత్తాన్ని మింగేలా యన్న ఆతృత కొందరిలో కలుగుతుంది. ఎవ్వరూ ఊహించనంత ఎత్తుకు ఎదిగిపోవాలని, ప్రపంచ కుబేరుల సరసన నిలబడాలని ఇలా ఏవేవో కోరికలు ఉత్పన్నమవుతాయి. ఇలాంటి ఆలోచనలో తప్పు కనపడకపోయినా ఒక రకంగా ఇది మానసిక రుగ్మత. దీనికేదైనా పేరు పెట్టాలంటే “అలగ్జాండర్ సింద్రోం” అని పెట్టుకోవచ్చు.

ఒక్క రాజ్యాన్ని గెలవగానే అసలు మొత్తం ప్రపంచాన్నే గెలిచేస్తే ఎలా ఉంటుందనుకుని బయలుదేరాడు అలగ్జాండర్. ఎందరో చావుకి కారణమయ్యాడు, చివరికి తానూ ఏమీ అనుభవించకుండానే పోయాడు. ఏంబిషన్ ఉండొచ్చు కానీ దానికీ ఒక లెక్కుండాలి. వ్యాపారమన్నాక రిస్క్ తీసుకోవాలి కానీ మరీ నేల విడిచి సాముగారడీ చేయకూడదు. అలా చేసి దెబ్బ తిన్నవాళ్లు ఎందరో. ఆ లిస్టులో ఇప్పుడు కొత్తగా చేరిన వ్యక్తి బైజూస్ రవీంద్రన్. బైజూస్ గురించి చెప్పాల్సిన పని లేదు. అందుకే రవీంద్రన్ గురించి చెప్పుకుందాం.

రవీంద్రన్ ది కేరళ. తల్లిదండ్రులిద్దరూ ఉపాధ్యాయులే. తల్లి లెక్కల గురువైతే, తండ్రి ఫిజిక్స్ మాస్టారు. దానివల్ల సహజంగా అతనిలో టీచింగ్ జీన్స్ వచ్చాయి. స్కూల్లో పెద్దగా చదవకపోయినా ఇంట్లోనే తన గురువులుండేసరికి అలా అలా చదివి ఇంజనీరైపోయాడు. కానీ తనలోని నేచురల్ జీన్స్ అతనిని టీచింగ్ వైపు నడిపాయి.

నెమ్మదిగా ఉద్యోగాన్ని పక్కనపెట్టి పోటీ పరీక్షలకి ప్రిపేరయ్యే విద్యార్థులకి ట్యూషన్స్ చెప్పడం మొదలుపెట్టాడు. తన పాఠాలతో విద్యార్థుల్ని ఆకర్షించగలిగాడు. వాళ్లకి మంచి రిజల్ట్ కూడా ఇప్పించగలిగాడు. ఇంతింతై అంతంతై అన్నట్టుగా చాలా బిజీ అయిపోయాడు. తన క్లాసులు నడపడానికి చోటు చాలక ఏకంగా స్పోర్ట్స్ స్టేడియం ని అద్దెకు తీసుకుని నడిపేవాడు. పెద్ద పెద్ద స్క్రీన్స్ పైన పాఠాలు చెప్పేవాడు.

దేశంలోనే మంచి పేరు రావడంతో తన విద్యార్థులనే ఉపాధ్యాయులుగా మార్చి 41 కోచింగ్ సెంటర్స్ పెట్టాడు. లెక్కలు, ఫిజిక్స్ లాంటివి దాదాపు ప్రతి కాంపిటీటివ్ ఎగ్జాంస్ కి అవసరం. వాటితో పాటు ఇతర సబ్జెక్ట్స్ కూడా తన కోచింగ్ సెంటర్స్ లో చెప్పబడేవి. అక్కడికే కోట్లల్లో సంపాదన ఉంది.




2011లో దివ్య అనే బయోటెక్ ఇంజనీర్ తో కలిసి “థింక్ అండ్ లర్న్” (బైజూస్ కి మాతృ సంస్థ) అనే కంపెనీ తెరిచాడు. ఆమెను తర్వాత పెళ్లి కూడా చేసుకున్నాడు. 2015లో తన వ్యాపారాన్ని డిజిటల్ ప్రపంచంలోకి తీసుకెళ్లి లెక్కలు, సైన్స్, ఇంగ్లీష్ బోధించడం మొదలుపెట్టాడు.

రవీంద్రన్ ఎదుగుదల చూసి సికోయా క్యాపిటల్ అనే కంపెనీ రూ 480 కోట్లు పెట్టుబడి పెట్టింది. అలా డబ్బొస్తుండడంతో రవీంద్రన్ లో నెమ్మదిగా పైన చెప్పుకున్న అలెగ్జాండర్ సింద్రోం మొదలయ్యింది. తన కంపెనీని పబ్లిక్ ఇష్యూకి తీసుకెళ్లి మరింత ఎక్కువ డబ్బు చూడాలనుకున్నాడు. 2020లో కరోనా లాక్డౌన్ కాలం అతని వ్యాపారానికి కలిసొచ్చింది. వర్క్ ఫ్రం హెూం, స్టడీ ఫ్రం హెూం నేపథ్యంలో బైజూస్ చాలా పాపులర్ అయ్యింది. సుమారు రూ 4000 కోట్ల ఫండ్ రైజింగ్ చెయ్యాలనుకున్నాడు 2021లో. కానీ బ్లాక్స్టోన్, ఫిడిలిటీ, జీఐసీ లాంటి అంతర్జాతీయ ఇన్వెస్టర్స్ దాదాపు రూ 9000 కోట్లు దాకా గుమ్మరించారు. ఆ దశలో కంపెనీ విలువని ఏకంగా 1లక్షా60వేల కోట్ల రూపాయల వరకు ఉంటుందని అంచనాలు వేసారు.

అన్నీ బానే ఉన్నాయి. కానీ 2022లో ప్రమాదం మీద పడింది. అలెగ్జాండర్ ఎలాగైతే యుద్ధం యావలో పడి తన సైన్యం ఆరోగ్యాన్ని ఎలా పట్టించుకోలేదో, రాబోయే బలమైన శత్రువుని ఎలా అంచనా వెయ్యలేక చావుదెబ్బతిన్నాడో.. బైజూస్ రవీంద్రన్ కూడా డబ్బు యావ లో పడి తన కంపెనీ ఫైనన్షియల్ హెల్త్ ఎలా ఉంది అనేది పట్టించు కోలేదు,

## ఫెయిల్యూయర్ స్టోరీ

లీగల్ గా ఏ ప్రమాదం ఎదురుపడుతుందో అని అంచనా వెయ్యలేదు. 1) విదేశాలనుండి డబ్బు తెస్తున్నప్పుడు ఫారిన్ ఫండ్స్ రెగ్యులేషన్ యాక్ట్ కి లోబడి తీసుకోవాల్సిన కొన్ని అనుమతులు, కట్టాల్సిన కొన్ని లెక్కలు ఉంటాయి. వాటిని సమయానికి ఫైల్ చెయ్యలేదు. 2) అంతే కాదు, తన బ్రాండ్ కి ఉన్న హైప్ ని మ్యాగ్జిమం ఎక్స్ప్లాయిట్ చేసుకోవాలనే ఉద్దేశ్యమో ఏమో విదేశాల నుంచి మరింత పెట్టుబడులు తెచ్చుకోవడానికి ఉవ్విళ్లూరాడు. లేని లాభాలు చూపించాడు......... అలా తనకి తెలియ కుం డానే డబ్బు యావలో పడి చాలా తప్పులు చేసేసాడు.

వీటితో పాటూ ఆన్లైన్ లో నడుస్తున్న తన బిజినెస్ కి ఆఫ్లైన్లో కూడా ఉనికి ఉండాలనుకుని ఎక్కడ పడితే అక్కడ బైజూస్ సెంటర్స్ తెరిచాడు. అమెరికాలో కుమాన్ తెలియని వాళ్లుండరు. అక్కడ తమ పిల్లల్ని కుమాన్ ట్యూషన్స్ కి పంపని భారతీయులు ఇంచుమించు ఉండేవారు కాదు. సరిగ్గా అలాంటి ఇమేజ్ సంపాదించడానికన్నట్టుగా ఆఫ్లైన్లో బైజూస్ సెంటర్స్ తెరవడం, భారీ జీతాలిచ్చి ఫ్యాకల్టీని పెట్టుకోవడం.....ఇవన్నీ తడిసి మోపెడయ్యాయి. ఆశ పెద్దదైతే రిస్క్ పెద్దదౌతుంది. రిస్క్ పెద్దదైతే ప్రమాదమూ పెద్దగానే ఉంటుంది.

బైజూస్ హడావిడి చూసి అనుమానాలొచ్చిన ప్రభుత్వ సంస్థలు కొన్ని లొసుగులు లాగగానే ఆర్థికపరమైన తప్పులు చాలా జరిగినట్టు గుర్తించారు. ఆ వెంటనే రైడ్ చేసారు. బండారం బైట పెట్టారు. ఒక్కసారిగా బైజూస్ పతనమయ్యింది. విదేశీ ఇన్వెస్టర్స్ భయపడి వెనక్కి తగ్గారు. ఇప్పుడు డబ్బు లేనిదే వ్యాపారం నడపలేని పరిస్థితి. దానికి తోడు ఆర్థిక నేరగాడిగా ముద్ర. చెదిరిన తన కల. రవీంద్రన్ కన్నీటిపర్యంతమయ్యాడు. ఉద్దేశ్యపూర్వకంగా తాను తప్పు చెయ్యాలని దిగకపోయినా, కేవలం అత్యాశవల్ల బుద్ధి మారిపోయి అతని చేత తెలియకుండా కొన్ని తెలిసి కొన్ని తప్పులు చేయించింది.

బైజూస్ రవీంద్రన్ స్టూడెంట్స్ కి పరీక్షల్లో ఎలా నెగ్గుకురావాలో పాఠాలు చెప్పాడు. అలాగే అత్యాశతో ఎలా ఓడిపోకూడదో తన జీవితంతో గుణ–పాఠం కూడా చెప్పాడు.

# బిచ్చగాడి మూట

ఒక రాజ్యంలో ఒక బిచ్చగాడు ఉండేవాడు. అతను రాజభవంతి దగ్గరలో ఉంటూ రోజూ, ఆ భవంతిలోని రాజుగారిని దూరం నుండి చూస్తూ ఉండేవాడు.

ఒక రోజు రాజుగారు ప్రజలందరికీ విందు ఇస్తున్నారు అనే వార్త విన్నాడు.

ఇది విన్న ఆ బిచ్చగాడికి ఒక ఆశ పుట్టింది.

తన దుస్తులు చూసుకున్నాడు అన్ని చిరిగిపోయాయి. ఎలాగైనా రాజుగారి నుండి మంచి దుస్తులు సంపాదించాలని అనుకున్నాడు. రాజభవనము దగ్గరకి వెళ్లి కాపలా వారిని బ్రతిమిలాడి, దర్బారులోకి ప్రవేశము సంపాదించాడు.

ఎంతో ధైర్యం కూడగట్టుకొని, చాలా వినయంగా రాజు దర్భారులోకి ప్రవేశించాడు.

అతన్ని చూడగానే రాజు. “నీకేమి కావాలి?” అని అడిగాడు.

దానికి ఆ బిచ్చగాడు రాజుగారికి వంగి వంగి దండాలు పెడుతూ ఇట్లా అన్నాడు

“రాజా! నాకు మీరు ఇస్తున్న విందుకు రావాలని వుంది. దయ చేసి తమ పాత దుస్తులు ఇప్పిస్తే అవి ధరించి విందుకు వస్తాను. నా దగ్గర చిరిగిన బట్టలు మాత్రమే ఉన్నాయి.” అన్నాడు.

రాజుగారు వెంటనే తన పాత దుస్తులను తెప్పించి బిచ్చగాడికిస్తూ “ఈ దుస్తులు చిరిగిపోవు, మాసిపోవు వాటిపై దుమ్ము పడదు, మరకలు అంటవు. ఎందుకంటే ఇవి ఎంతో ప్రత్యేకమైనవి. నీవు ఎప్పటికి వీటిని ధరించవచ్చు” అన్నాడు.

బిచ్చగాడి కళ్ళ వెంట నీరు రాగా రాజుగారికి ధన్యవాదములు చెప్పాడు. వెంటనే ఆ దుస్తులు తన గదికి తెచ్చుకొని ధరించి అద్దములో చూసుకొని మురిసిపోయాడు బిచ్చగాడు.

అయితే రాజుగారు ఎంత చెప్పినా, బిచ్చగాడి కి ఆ రాజుగారి దుస్తులు చిరిగిపోతే ఎట్లా అనే భయం పట్టుకొంది.

ఎందుకైనా మంచిదని పాతదుస్తులన్నీ ఒక మూటకట్టి తన వెంటే ఉంచుకొని తిరిగేవాడు. ఎందుకంటే రాజుగారి దుస్తులు చిరిగితే తన పాత దుస్తులు ధరించవచ్చు అని.



రాజుగారిచ్చిన విందు భోంచేస్తున్నంతసేపు కూడా తనకి ఆనందంగా లేదు. బైట ఎక్కడో దాచిన తన పాత దుస్తుల మూట ఎవరన్నా ఎక్కడన్నా పారవేస్తారేమో అని భయం తనకి.

క్రమంగా రాజుగారి మాటలలోని సత్యం తెలిసివచ్చింది. ఎన్ని రోజులు ధరించినా దుమ్ము పడలేదు, అవి కొత్తవిగానే వున్నాయి. కానీ తన పాత దుస్తులపై మమకారంతో ఆ మూటను మాత్రం అస్సలు వదిలేవాడు

## మనసులో మాట

కాదు.

అతని తోటి వారు అతనిని చూసి, ‘ధరించిందేమో రాజుగారి దుస్తులు మోసేదెమో పాత గుడ్డలు!’ అని హేళన చేస్తూ “పీలిక గుడ్డల మనిషి” అని తనకి పేరు పెట్టారు.

చివరగా ఆ బిచ్చగాడు చనిపోవుటకు సిద్ధముగా ఉండి మంచం పై నుండి లేవలేక పోయేవాడు. పక్కనున్న జనాలు అతని తలగడ దగ్గర ఉన్న పాతబట్టల మూటను చూశారు. అది చూసి, ఎంతో విలువైన చిరగని తరగని దుస్తులు ధరించినా కూడా బిచ్చగాడికి ఆ పాత బట్టల మూటపై వ్యామోహం పోలేదు.

వాటి సంరక్షణ కోసమే జీవితం అంతా గడిపి, ఏ రోజూ సంతోషము పొందలేదు గదా! అని బాధపడ్డారు చూసిన ప్రజలు.

**ఇందులోని నీతి:**ఇది ఒక బిచ్చగాడి కథ మాత్రమే కాదు! మనం అందరమూ కూడా ఈ అనుభవాల మూటలను పట్టుకొని, వదలకుండా ఇప్పటికి ఎప్పటికి అలానే మోస్తూ ఉంటున్నాము.

మనం మోస్తున్న మూటలో ఉన్నవి ఏమిటంటే శత్రుత్వము, ఈర్ష్య, ద్వేషము, కోపము, మన బాధలు మొదలగునవి ఇంకా ఎన్నో జ్ఞాపకాలు. అంతే కాదు, ఈ భావనలతో మాటి మాటికీ దుర్గుణాలను, దుఃఖాన్ని గుర్తుతెచ్చుకుంటూ జీవితంలోని అందమైన, సంతోషమైన వాటిని అనుభవించలేకపోతు న్నాం. ఇలా ఉంటే జీవితంలో వేటినీ గుర్తించలేము ఆనందించలేం కూడా!

**ఎప్పుడో, ఎక్కడో జరిగిన సంఘటనలను ఎక్కడకక్కడ, ఎప్పటికప్పుడు వదలకుండా ఒక పెద్ద పనికిరాని పాత బట్టల మూటలాగా, ఆ జ్ఞాపకాల బరువును మోస్తూ ఉండటమే అనేక బాధలకు, మనలోని అశాంతికి కారణము.**

# ధనుర్మాసం వచ్చేసింది



**ముక్తికి మార్గం... మార్గశిరం శ్రీమన్నారాయణుడి ఆరాధనతోపాటూ పలు పర్వదినాల సమాహారం మార్గశిర మాసం. మహావిష్ణువుకు ఎంతో ప్రీతికరమైన ఈ మాసంలో చేసే లక్ష్మీపూజలూ, ఉండే ఉపవాసాలతో సకల శుభాలు కలుగుతాయని చెబుతున్నాయి శాస్త్రాలు. 'మాసానాం మార్గశీర్షాహం' అంటాడు కృష్ణభగవానుడు. మార్గశీర్షం అంటే మార్గాలలో శ్రేష్ఠమైనదనీ, ఉపయోగకరమైనదనీ అర్థం. కార్తికేయుడు, కాలభైరవుడు, దత్తాత్రేయుడుతోపాటూ భగవద్గీత అవతరించిన మాసం కూడా ఇదే కావడం విశేషం. దక్షిణాయనానికి చివర, ఉత్తరాయణానికి ముందుడే ధనుర్మాసం ప్రాత:కాలంలా పవిత్రమైంది. ధనుర్మాసం అంటే దివ్య ప్రార్థనకు అనువైన మాసం అని అర్థం.**

ముక్తికి మార్గం... మార్గశిరం శ్రీమన్నారాయణుడి ఆరాధనతోపాటూ పలు పర్వదినాల సమాహారం మార్గశిర మాసం. మహావిష్ణువుకు ఎంతో ప్రీతికరమైన ఈ మాసంలో చేసే లక్ష్మీపూజలూ, ఉండే ఉపవాసాలతో సకల శుభాలు కలుగుతాయని చెబుతున్నాయి శాస్త్రాలు. 'మాసానాం మార్గశీర్షాహం' అంటాడు కృష్ణభగవానుడు. మార్గశీర్షం అంటే మార్గాలలో శ్రేష్ఠమైనదనీ, ఉపయోగకరమైనదనీ అర్థం. కార్తికేయుడు, కాలభైరవుడు, దత్తాత్రేయుడుతోపాటూ భగవద్గీత అవతరించిన మాసం కూడా ఇదే కావడం విశేషం. దక్షిణాయనానికి చివర, ఉత్తరాయణానికి ముందుడే ధనుర్మాసం ప్రాత:కాలంలా పవిత్రమైంది. ధనుర్మాసం అంటే దివ్య ప్రార్థనకు అనువైన మాసం అని అర్థం.

నిజానికి ఆండాళ్ పూజ, తిరుప్పావై పఠనం, గోదా కళ్యాణం మొదలైనవి ద్రావిడ దేశ సంప్రదాయమని పెద్దలు తెలియజేశారు. ధనుర్మాసం కాలంలో తిరుమల శ్రీవారి ఆలయంలో సుప్రభాతానికి బదులుగా తిరుప్పావై పఠనం చేస్తారు. సహస్రనామార్చనలో తులసికి బదులు బిల్వపత్రాలతో పూజిస్తారు.

ధనుర్మాసం ఉభయ సంధ్యల్లో ఇంటిని శుభ్రం చేసి దీపారాధన చేయడం వల్ల మహాలక్ష్మీ అనుగ్రహం లభిస్తుంది. దరిద్రం తొలగి అష్టఐశ్వర్యాలు సిద్ధిస్తాయి. విష్ణు ఆలయాల్లో ఉదయం అర్చన తర్వాత ప్రసాదాన్ని నివేదించి వాటిని పిల్లలకు పంచుతారు. దీన్నే బాలభోగం అంటారు. సూర్యుడు ధనస్సు నుంచి మకర రాశిలోకి ప్రవేశించే వరకు అంటే భోగి రోజు వరకూ ధనుర్మాసం కొనసాగుతుంది. ఈ నెల రోజులు విష్ణు ఆలయాల్లో పండుగ వాతావణం నెలకొంటుంది.

సంక్రాంతికి ఒక నెల ముందు నుంచి ధనుర్మాసం ప్రారంభమవుతుంది. సూర్యుడు ధను రాశిలో ప్రవేశించడంతో ధనుర్మాసం మొదలవుతుంది. తిరిగి సూర్యుడు మకర రాశిలోకి ప్రవేశించే సంక్రాంతి రోజుతో ధనుర్మాసం ముగుస్తుంది. ధనుర్మాసం ప్రారంభాన్నే పల్లెటూర్లలో సంక్రాంతి నెల పట్టడము అంటారు. కురువృద్ధుడు భీష్ముడు అంపశయ్య మీద ఉండి ఉత్తరాయణ పుణ్యకాలం వచ్చేవరకు ఆగి ఆ పుణ్యకాలం వచ్చాకే మరణించిన సంగతి అందరికీ తెలిసిందే.

**ధనుర్మాస వ్రతం**


మార్గశిర పౌర్ణమి తర్వాత పాఢ్యమి నుంచి వైష్ణవులు ధనుర్మాస వ్రతానికి శ్రీకారం చుడతారు. విష్ణుమూర్తికి ఎంతో ప్రీతికరమైన మాసం ధనుర్మాసం. గోదా దేవి మార్గళి వ్రతం పేరుతో ధనుర్మాసంలో వ్రతాన్ని చేపట్టి నారాయణుని కొలిచింది. ధనుస్సంక్రమణ రోజున నదీ స్నానాలు, పూజలు, జపాలు చేయడం మంచిది. వైష్ణవ, సూర్యాలయాలను కూడా సందర్శించడం కూడా శుభప్రదం.

(మిగతా 8వ పేజీలో)



(7వ పేజీతరువాయి)

ఈ జగత్తులోని అన్నింట్లో తాను ప్రకటితమైనప్పటికీ కొన్నింట్లో తన స్వరూపం స్పష్టంగా తెలుస్తుందనీ, అలాంటి కొన్నింట్లో ఈ మాసం కూడా తన స్వరూపమేననీ చెబుతాడు కృష్ణుడు. ఈ నెలలో లక్ష్మీ నారాయణుడిని తులసీదళంతో పూజించడం పుణ్యప్రదమని అంటారు. ఆధ్యాత్మికంగా మానసిక శక్తిని ఇచ్చే ఈ మాసంలో వచ్చే గురువారాల్లో మహాలక్ష్మిని పూజిస్తే ఆయురారోగ్యాలూ, సిరిసంపదలూ వృద్ధి చెందుతాయని చెబుతున్నాయి పురాణాలు.



## తిరుప్పావై.

భక్త వత్సలుడైన ఆ శ్రీమహావిష్ణువుకు అత్యంత ప్రీతి పాత్రమైనది "ధనుర్మాసము". ఈ మాసములో ఆ స్వామిని ఉద్దేశించి చేసే చిన్నపాటి పూజాది క్రతువైనా అక్షయ, అమోఘ సత్ఫలితాలను ప్రసాదిస్తుంది. ఈ మాస దివ్య ప్రభావము వల్లే గోదాదేవి సాక్షాత్ ఆ శ్రీ రంగనాయకుని పరిణయ మాడిందనే విషయం మనకు పురాణాల ద్వారా తెలుస్తుంది. సాక్షాత్ భూదేవి, అవతార మూర్తి అయిన అండాళ్ రచించిన దివ్య ప్రబంధమే తిరుప్పావై. 'తిరు' అంటే మంగళ కరమైన అని , 'పావై' అంటే మేలుకొలుపు అనే అర్థం వస్తుంది. ఈ మాసంలో విష్ణువును మధుసూధనుడు అనే పేరుతో పూజించి, మొదటి పదిహేను రోజులు చక్కెర పొంగలి లేదా పులగం స్వామికి నైవేద్యంగా సమర్పించాలి. తర్వాత పదిహేను రోజులు దద్యోజనం అర్పించాలి. పెళ్లిడు అమ్మాయిలు తమ ఇళ్లముందు ముగ్గులు, గొబ్బిళ్లతో పూజలు చేయటం వల్ల కోరిన వరుడు లభిస్తాడు. గోదాదేవి మార్గళి వ్రతం పేరుతో విష్ణువును ధనుర్మాసమంతా పూజించింది. . గోదాదేవి మార్గళి వ్రతం పేరుతో విష్ణువును ధనుర్మాసమంతా పూజించింది. రోజూ ఒక కీర్తనతో ఆమె స్వామిని కీర్తించేది. విష్ణు చిత్తుడను బ్రాహ్మణుని ఏకైక పుత్రిక గోదాదేవి మంచి సౌందర్యరాశి. ఆమె తోటలోని పూలను కోసి రకరకాలైన అందంగా పూల మాలలను కట్టి తను ధరించి అద్దమందు తనప్రతిబింబమును చూచు కొని మురిసి పోవుచూ ఆమాలలను పదిలంగా తండ్రి కిచ్చేది. ఈ విషయము తెలియని ఆ మహా భక్తుడు శేషశయనుడు శ్రీ రంగనాథ స్వామి వారికి సమర్పింపగా అర్చకులు స్వామి వారికి అలంక రింపజేసేవారు. ఇదే విధంగా ప్రతి రోజూ జరుగసాగింది. అయితే గోదాదేవి స్వామి వారిపై రోజు రోజుకూ ప్రేమ ఏర్పడి ఆపరాత్పు రునే తన భర్తగా ఊహించుకొనేది. చివరకు అనంత శయనుడైన శ్రీ రంగనాథ స్వామి నే వివాహమాడ వలెనని త్రికరణ శుద్ధిగా నిర్ణయించుకుంది. ఎప్పటివలెనే మాలలను ధరించి తన ప్రక్కనే రంగనాథ స్వామి ఉన్నట్లుగా భావించి మురిసిపోవు చుండెడిది. ఇలాగే ఎల్లకాలం జరుగదుగా ఒక రోజు పూజార్లు ఆ మాలలను అలంకరించు సమయమందు ఆమాలలో దాగిఉన్న ఒక పొడవాటి వెంట్రుకను ఉన్నది గమనించారు. అది స్త్రీ వెంట్రుకని తెలుసు కున్నారు. ఆమాలలను తెచ్చిన ఆమహాభక్తుని నానాదుర్భాష లాడారు. అప్పుడు విష్ణు చిత్తుడు సరాసరి ఇంటికి వెళ్ళగా అక్కడ మాలలను అలంకరించుకుని స్వామి వారితో మాట్లాడుతున్న తన కూతురుని చూసి అమితమైన ఆగ్రహముతో నిందించి పక్కనే ఉన్నకత్తితో చంపబోగా గోదాదేవి తన ప్రేమ వృత్తాంతమును తండ్రికి తెలియజేసింది. తండి తన కూతురు మాటలు విశ్వసించక అబద్దమాడుతున్నదని భావించి ఆమెను చంపబోగా అదృశ్యరూపుడుగా ఉన్న స్వామి ప్ర త్యక్షమై ఆమెదెంత మాత్రమూ తప్పులేదని ఆమె ధరించిన మాలలే తనకత్యంత ఇష్టమని తెలియజేసి అందరి సమక్షములో శ్రీ రంగనాథస్వామి గోదాదేవిని వివాహమాడాడు.మానవ స్త్రీ సాక్షత్తు దేవున్ని తన భక్తి శ్రద్దలతో మెప్పించి చివరకు వివాహం ఆడేవరకు వదలలేదు. నిష్ట కలిగిన భక్తికి భవవంతుడు తన్మయుడవుతాడు అనడానికి ఈ వృత్తాంతం మనకు చాలు. నాటి నుండి గోదాదేవిని ఆండాళ్ గా పిలువ బడసాగింది. ఆండాళ్ స్వామి వారిని కీర్తించిన కీర్తనలే పాశురాలు. విజయనగర సార్వభౌముడైన శ్రీ కృష్ణ దేవరాయలు"ఆముక్త మాల్యద"అను పేరున "విష్ణు చిత్తియం అనిగూడ అందురు" గ్రంధ రచన గావించెను. ఆముక్తమాల్యద అనగా 'తీసి వేసినదండ 'అని అర్థము.ధనుర్మాస వ్రతం దీని గురించి మొదట బ్రహ్మదేవుడు నారద మహర్షికి వివరించినట్లు పురాణ కథనం. ధనుర్మాస వ్రతానికి సంబంధించిన అంశాలు బ్రహ్మాండ, ఆదిత్య పురాణాలు, భాగవతం, నారాయణ సంహితాల్లోనూ కనిపిస్తాయి. అవివాహితులు, మంచి కోరికలు ఉన్నవారు తిరుప్పావై పారాయణం చేయడం వల్ల అవి ఫలిస్తాయని భావిస్తారు. విష్ణుచిత్తుడి కుమార్తె గోదాదేవి మానవ మాత్రులని కాక శ్రీరంగనాథుడినే వివాహం చేసుకుంటానని దీక్ష బూనుతుంది. ఆమె ధనుర్మాసంలో వేకువనే లేచి నిత్యం విష్ణువుని పూజి స్తూ తన అనుభూతిని, భావాలన్ని ఒక పద్యం అన గా పాశురం రూపంలో రచించేది. అలా 30 పాశు రాలను ఆ మాసంలో రచించి వాటిని విష్ణు వుకు అంకితం చేసింది. ఆమె భక్తికి మెచ్చి విష్ణువు ప్రత్యక్షమై ఆమెను శ్రీరంగం రమ్మని అంటాడు. ఆమె ఈ విషయాన్ని తన తండ్రికి చెప్పడంతో ఆయన గోదాదేవిని తీసుకొని శ్రీరంగం చేరుకుంటాడు. రంగనాథస్వామితో వివాహం జరిగినంతనే గోదాదేవి ఆయన పాదాల చెంత మోకరిల్లి స్వామిలో అంతర్లీనమై పోతుంది. ఈ నెలలో ప్రతిరోజు సూర్యోదయానికి కంటే ఐదుఘడియలు ముందుగా నిద్రలేచి కాల కృత్యాలను పూర్తిచేసుకుని, తలస్నానం చేసి నిత్య పూజలు, సంధ్యావందనాలను ముగించి, అనంతరం ధనుర్మాస వ్రతాన్ని ఆచరించాలని మన పురాణాలు తెల్పుతున్నాయి.



## ధనుర్మాసంలో వివాహాలు జరిపించరు.

ఎందుకంటే రవి ధనస్సు రాశిలోకి ప్రవేశించి మకరంలోకి వెళ్ళే సమయ-ంమే ధనుర్మాసం. ధనుస్సు , మీనంలో రవి ఉన్నప్పుడు, సూర్యుని రాశి అయిన బృహస్పతిలో ఉన్నప్పుడు ఏ శుభకార్యాన్ని నిర్వహించకూడదు. కేవలం పండుగ వాతావరణంతో అంతా సంతోషంగా, ప్రశాంతంగా ఉండగలుగుతారు. ఈ మాసంలో ఎక్కువగా సూర్య నమస్కారాలు చేస్తారు. ఇంకా విష్ణుమూర్తిని నిత్యం వేకువనే పూజిస్తారు. ఇలా చేయటం శుభం.



## వైష్ణవాలయాలను దర్శించడం శుభం

ఈ మాసంలో స్వామివారిని ఆవు పాలు, కొబ్బరి నీరు, పంచామృతాలతో అభిషేకిస్తే తమ కుటుంబం సుఖసంతోషాలతో ఉంటారని భక్తుల విశ్వాసం. ఈ మాసమంతా విష్ణుపురాణాన్ని, విష్ణుగాథలను చదువుతూగానీ, వింటూగానీ గడపడం, వైష్ణవాలయాలను దర్శించడం చేయాలని, అలాగే ఈనెలరోజుల పాటూ ఈ వ్రతాన్ని చేయలేనివారు 15 రోజులుగానీ, 8 రోజులుగానీ, 6 రోజులుగానీ, 4 రోజులుగానీ, లేదంటే కనీసం ఒక్కరోజు నిష్టతో ఉంటే స్వామివారి సంతృప్తి చెంది కోర్కెలు తీరుతాయని మన పురాణాలు తెలుపుతున్నాయి. తిరుమలలో ధనుర్మాసం నెలరోజులు, సుప్రభాతం బదులు తిరుప్పావై గానం చేస్తారు. విష్ణు ఆలయాల్లో ఉదయం పూట అర్చనలు చేసి నివేదనలు చేసి వాటిని పిల్లలకు పంచుతారు. ఈ నెల రోజులూ హరిదాసులకీర్తనలతో, జంగమ దేవరలతో, గంగిరెద్దుల ను ఆడించేవారితోనూ సందడిగా వుంటుంది. ముంగిళ్ళలో కల్లాపి జల్లి, ముత్యాలముగ్గులతో కనుల విందుగా వుంటాయి. ధాన్యపు రాశులను ఇళ్ళకు చేర్చిన రైతు ల సంభారాలతో పల్లెలు "సంక్రాంతి "పండుగ కోసం యెదురుచూస్తూ వుంటాయి. ఈ ధనుర్మాసంలో ఉభయ సంధ్యల్లో ఇల్లు శుభ్రం చేసి దీపారాధన చేయటం వల్ల మహాలక్ష్మీ అనుగ్రహం లభిస్తుంది. దరిద్రం దూరం అవుతుంది. ఈ మాసంలో ప్రతి రోజు బ్రాహ్మముహూర్తంలో పారాయణం చేసిన వారు దైవానుగ్రహానికి పాత్రులగుట తథ్యమని శాస్త్ర ప్రచనం.

(మిగతా 9వ పేజీలో)

## మనసులో మాట

# రోడ్డు



'ఛూ నీయమ్మ దరిద్రపు రోడ్డు, ఇంత అద్దుమానపు రోడ్డు యాడ సూళ్ళేదు ' ప్రయాణ అగచాట్లలో ఆరోడ్డును తిట్టుకోవటం రోడ్డు దాటాక మరిచిపోటం ఆఊరోళ్లకు మామూలే..

విడివిడిపోచలు ఆఊరి పశువులకు రోజూ గడ్డి మోపులవుతుంటాయి కానీ.. మనుషులను ఒక్కటి కానివ్వని కొన్నిపరిస్థితులున్నాయ్ ఆఊళ్ళో..రకరకాల పార్టీలు, కులాలు, సామాజిక స్థితులు బాధితులందరినీ ఒక్కటి కానివ్వటంలేదు.. అందుకని ఎవరికివారు విడివిడిగా వాపోవటమే జరుగుతోంది...

'రోడ్డు బాగు చెయ్యమని ధర్నా చేద్దాం'.. అని ఒకసారి అనుకున్నారు కానీ ఊరినుంచి టవునుకుపోయేటోళ్లు టవునునుంచి ఊళ్ళోకి వచ్చేటోళ్లు అంతా తమ ఊరివాళ్ళు చుట్టుపక్కల ఊళ్ళ వాళ్ళు, పాలోళ్ళు కనుక తమవాళ్ల రాకపోకలను అడ్డుకొని అంతరాయం కల్పించటం ధర్మంకాదని ఆ ప్రయత్నం విరమించుకున్నారు..

' ఓట్లను బహిష్కరిద్దాం.. కలెక్టర్ దిగొస్తడు రోడ్డు సౌలత్ అదే వొస్తది అని సర్పంచ్ ఎన్నికలనుంచి ఎంపీటీసీ, జెడ్పీటీసీ, ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికలకు ముందు తీర్మానించుకుంటారు కానీ తీరా పోలింగ్ తేదీ దగ్గర పడేసరికి ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు, వాళ్లనోళ్లను కరెన్సీ నోట్లతో కట్టి పడేస్తారు.. పార్టీలు, కులాలు అందుకు ఊతమిస్తుంటాయి..

'ఊరు ఇంకెంత దూరం ఉంటుంది'.. చూపు ఆనినంతమేరా అధ్వాన్నంగా కనపడుతున్న మట్టి రోడ్డును చూస్తూ అడిగాడు ఎమ్మెల్యే అభ్యర్థి రామిరెడ్డి.. ఇంగో మూడు కిలోమీటర్లుంటది సార్ అన్నాడు అతని పార్టీ నాయకుడు.. ఊళ్ళో ఎన్నికల ప్రచారం నిర్వహించేందుకు కార్లు, ప్రచార రథం మంది మార్బలంతో వచ్చాడు రామిరెడ్డి ఎన్నికల ప్రచార బృందాన్ని స్వాగతించి ఊళ్ళోకి తీసుకుపోయేందుకు అక్కడికి మోటార్ సైకిళ్లతో చేరుకున్నారు గ్రామ, మండల పార్టీ శ్రేణులు.. 'రోడ్డు అసలేం బాలేదు సార్, గోతులతో కంకరతేలి ఉంది కొన్నిచోట్ల బురదగుంటలు కూడా ఉన్నాయ్ టైర్లు దిగబడే ప్రమాదం ఉంది' అని చెప్పాడు డ్రైవర్.. ' మోటార్ సైకిళ్లమీద ఎలాగో వెల్దాం సార్ ఊళ్ళో మొత్తం పదివేల దాకా ఓట్లున్నాయ్ ' అని పార్టీ నాయకుడు చెబుతుండటంతో..కారు దిగి మోటార్ సైకిల్ ఎక్కాడు..ఎంత తప్పిద్దాం అనుకున్నా టైర్లు ఒకటికాకపోతే మరో గుంటలో పడుతూ లేస్తుండటంతో టూ వీలర్ గంతులేస్తోంది..ఎమ్మెల్యే అభ్యర్థి సహా ప్రచార బృంద నడుములు హూనమవుతున్నాయి..

ఇళ్ళల్లో ఏడెనిమిదింటికల్లా మలిగిపోయే మాటలు గత నాలుగైదురోజులుగా బుడ్డి దీపాలతోపాటు వెలుగుతున్నాయ్.. 'ఏ రేత్తిరైనా అత్తం..పెనగడ దెగ్గరికి ఏసి ఉంచండి గొళ్లెం సప్పుడు జేయంగనే తలుపుదీయండి'.. నులకమంచాల్లో, ఈత సాపల్లో పండుకున్నోళ్ల చెవుల్లో కోడి పుంజులు కొక్కొరోకో అనేదాక ఈమాటలే వినపడుతున్నాయ్..

'అచ్చినారక్కా.. బర్రెకు మేతవేస్తున్న ఈరమ్మ చెవిలో గుసగుసగా అడిగింది పక్కింటి చుక్కమ్మ.. 'రామరామ యాడిదమ్మా మీ బావ నేను ఎదురుసూసి ఎదురుసూసి యాసారినం ఇగరాలె అగరాలె' అంది ఈరమ్మ అంతే గుసగుసగా..'కొంటెకారు గుంపులుగుంపులుగా బజాట్లె అటిటు సారీలు దోల్తాంటే ఇయ్యాలనన్నా రావచ్చును అనుకుంటిమి రోజు దెగ్గెరబడతంటె ఇగెప్పుడంటఅచ్చేడిది' ... తన అసహనం వ్యక్తం చేసింది చుక్కమ్మ.. ' ఇగనన్న అస్తరో మాటలతోనే సరిపుచ్చుతరో '.. కుడితి పోస్తూ అంది ఈరమ్మ.. 'రాకుంటె మనం బోవుడు లేదు ఏసుడు లేదు అయినా ఈళ్ల ఇంట్లెకెల్లిచ్చేటియా ఏంది '.. అంది చుక్కమ్మ మూతి తిప్పుతూ.. ' అగో సూడు పొద్దంత ఆళ్ళొచ్చి అతికిచ్చి ఈల్లొచ్చి అతికిచ్చి తలుపులు నామరూపాల్లేకుండైనయ్ '..అంది ఈరమ్మ డోర్ పోస్టర్లు పాంప్లేట్ల వైపుచూపిస్తూ..

' అటు రెడ్డేనాయ్ ఇటూ రెడ్డేనాయ్ ఈపాలి టగ్గాపోర్ ఉంటది పంచుడు సుత అట్టనే ఉంటది మునపటికన్నా ఎక్కువుంటది అని బగ్గ పెచారమాయె మాటలైతె మస్తుగ ఇనబడతన్నయ్ గానీ ఎవళస్తనేలేరు '.. రావి చెట్టు ముచ్చట్లలో ఈ ఆరోపణలే చోటుచేసుకుంటున్నాయ్..

ఆరాత్రి పెంపుడు కుక్క భౌ మనగానే గబాల్న వెళ్లి తలుపు తీశాడు ఓదేలు అంత చీకట్లో వచ్చిందెవరెవరో గుర్తుపట్టాడు.. కుక్క మొరుగుతూనే ఉంది.. దాన్ని బయటకు వెళ్లగొట్టి పెనగడ వేసి వస్తుండగా ' గబుక్కున రా అన్నా .. తలుపేయ్ తలుపేయ్ వాళ్లీళ్లు సూడగాల' అన్నాడు వచ్చిన వాళ్లలో ఒకతను.. 'మొత్తం ఎన్నున్నయ్ మీ ఇంట్లె' అని అడుగుతూ తన చేతిలోని లిస్టు చూసేపనిలో నిమగ్నమయ్యాడు ఇంకో అతను.. ' ఓదేలు ఇగ ఇసుంటరా' అని పిలిచాడు వాళ్లతో వచ్చిన ఖద్దరు చొక్కా పెద్దమనిషి.. దేవుడి ఫొటో ముందుకు పిలిచి 'ఇగో ఒకో ఒటుకు ఇంత' అని మొత్తం చేతులో పెట్టి.. 'ఒక్క ఓటు సుత బీరుబోగూడదు..మొత్తానికిమొత్తం పడాల టవున్లో కాలేజీ సదువుతన్న మీ పిలగాడ్ని గూడ పిలిపిచ్చాలా' అన్నాడు..' దేవుడి సమచ్చంలో డబ్బు ముట్టజెపుతన్నవ్ మాటదప్పుతనా, అంత బుద్ధితక్కువోడ్ని గానులే' అన్నాడు ఓదేలు డబ్బు జేబులో పెట్టుకుంటూ.. 'సరె పోయొస్తం చెల్లెమ్మా చెప్పింది మరవకుండ్రి' అంటూ వొచ్చినోళ్లు పెనగడ దీసుకోని బయటకు పోతుంటే మళ్లీ మొరుగుతూ ఇంట్లోకొచ్చింది కుక్క..

'మొత్తం రొండొందల యాబయ్ ఉన్నయే'... అని ఓదేలు అంటుంటె 'ఓటుకు ఎంతిచ్చినట్టు' అని అడిగింది ఈరమ్మ..'ఏముంది మనింట్లె అయిదు ఓట్లున్నయ్ అంటే ఓటుకు యాబయ్' ఇచ్చినట్టు అని అన్నాడు..

మరుసటి రాత్రి మళ్లీ కుక్క మొరిగేసరికి లేచి వెళ్లి తలుపు తీశాడు.. 'బావా ఇగో మీ ఇంట్లె అయిదుఓట్లకు అయిదు అరవయ్ ల సొప్పున మూడొందలు' అని మరొక బృందం ఇవ్వబోతుంటె..'ఏయ్ మాకు డబ్బొద్దు ఏమొద్దు.. మేము ఓటమ్ముకునేటోళ్లం గాదు' అని తిరస్కరించాడు ..'అరే అట్లెందుకు అనుకుంటవు ఏదో నా సంతోషానికిస్తన్న..రెడ్డిగారు ఇచ్చిరమ్మని నన్నుతోలిండు..ఇగబట్టు నువ్వు తీస్కోలేదని తెలిస్తే మల్ల నాకు మాటొత్తది' అంటూ బలవంతంగా ఓదేలు చేతి లాగి అరచేతిలో పెట్టే ప్రయత్నం చేసినా ససేమిరా వినలేదు..'మీరు బలవంతంగా పెట్టిపోతె ఊరి గుళ్లె కానుకేత్త మీపేర్న' అన్నాడు ఓదేలు.. ఓదేలు ఓట్లు తమకు పడేవి కావని తెలుసు అయినా తమవంతుగా ప్రయత్నం చేసి కమిట్మెంట్ పొందాలని వొచ్చారు వాళ్లు ప్రయత్నం ఫలించకపోవటంతో ఆశలు ఒదులుకొని మరో ఇంటివైపు నడిచారు 'మల్లోపాలి ఆలోచించుకో బావా' అంటూ ..

'యాదయ్య ఎంకా రెడ్డి కాడ గూడా తీస్కున్నడంట పైసల్' ఇంకా ఇద్దరు ముగ్గురు ఎవరెవరు అట్లా ఇద్దరివద్దా తీసుకున్నారో క్షణాల్లో ఊరంతా పాకిపోయింది..

' ఒద్దు వద్దని మొత్తుకుంటన్నా ఇనవయ్యివి డబ్బుకు ఆశపడి ఇద్దరి దగ్గెర గుంజితి వి రొండేపులా దీసుకున్నమని ఊరు కోడై కూత్తన్నది' అన్నడు ఎలమంద తన భార్య ధనమ్మని నిందిస్తూ.. 'అయితాయె ఏంది అనుకుంటె అనుకోనీ ఇంట్లె ఆరోట్లున్నయ్ మూడు ఒకళ్లకి మూడొకళ్లకి ఏద్దం ఎవుల్లకి జేసిన అన్నాయమేమున్నది' అని నింపాదిగా అంది..

కాలంగడిచింది ఓదేలు కాలం చేశాడు అతని కొడుకు వినోద్ తరంవొచ్చింది .. పోలింగుకు మరో వారం గడువుందనగానే పంచుడు షురూ అయ్యింది.. అభ్యర్థుల తరపున ఎవరికి వారు బాహాటంగానే ఇంటింటికీ తిరుగుతూ డబ్బు పంచుతున్నారు.. ఓదేలు తరం నుంచి ఇప్పటివరకు అతని ఇంటి పరిస్థితి ఆఊరి స్థితి ఏమాత్రం మారలేదు రోడ్లు, సదుపాయాలు యధాతథంగా ఉన్నయ్.. ఓటు విలువా పెరగలేదు కానీ ఓటరు విలువ మాత్రం అమాంతం అధికమయ్యింది.. ఓటు కొనే తీరు మారింది తన ఇంట్లో నాలుగు ఓట్లకు ఓటు మూడువేల చొప్పున పన్నెండువేలు తీసుకున్నాడు వినోద్.. అంతకు ముందు రోజే మరో అభ్యర్థి నుంచి ఓటుకు రెండువేల చొప్పున తీసుకొని ఉన్నాడు.. మూడువేలు ఇచ్చిన అభ్యర్థే అంటున్నాడు 'డబ్బులు ఎవరిచ్చినా తీసుకో ఓటు మాత్రం మనకే వెయ్' అని..

వినోద్ కొడుకు అయిదేళ్ల చిన్నాకి రెండురోజులుగా వాంతులు విరేచనాలవుతుంటే ఊళ్ళోని ఆర్ ఎంపీకి చూపించారు ఆరాత్రి చిన్నాకి అనారోగ్యం ఎక్కువయ్యింది..ఆర్ ఎం పీ పరీక్షించి సీరియస్ గా ఉంది వెంటనే టవున్ హాస్పటల్ కి తీసుకుపోవాలని చెప్పాడు..

ఊరి రోడ్డు దుస్థితి కారణంగా ఆటోలు తిరగవు..గతంలో పొద్దున ఒకసారి సాయంత్రం ఒకసారి ఆర్టీసీ బస్సు పడుతూ లేస్తూ వచ్చిపోతుండెది..గుంటల్లో కుదుపులవల్ల తరచూ మరమ్మత్తులకు గురవుతుండటంతో బస్సు రావటం ఆగిపోయింది.. గత్యంతరం లేక వినోద్ ఆర్ ఎంపీతో కలిసి తన కొడుకును టూ వీలర్ మీద కూర్చోబెట్టుకొని మండల కేంద్రం వైపు స్టార్ట్ చేశాడు..రోడ్డు గుంటల్లో బండి ఎత్తేస్తుండేసరికి పిల్లోడు మరింత నీరసించాడు.. ఎలాగో ప్రాణం అరచేతిలో పట్టుకొని ప్రయాణిస్తుండగా టూ వీలర్ చక్రం బురదలో దిగబడి ముందుకు కదలక మొరాయించింది..పావుగంట శ్రమించి ఎలాగో బయటకు లాగి కొంత దూరం పోగానే మొనతేలిన కంకర రాళ్ళు గుచ్చుకొని టైర్ పంచర్ అయ్యింది.. సకాలంలో వైద్యం అందకపోవటంతో ఐదేళ్ల చిన్నాకు నూరేళ్లు నిండాయి.. కొడుకు శవాన్ని గుండెకు హత్తుకుంటూ పెద్దగా అరుస్తూ వినోద్ అక్కడే కూలబడ్డాడు..

చిన్నాతల్లి, నానమ్మ ఈరమ్మ, ఇతరబంధువులూ పెద్ద పెట్టున ఏడుస్తూ అక్కడికి చేరుకున్నారు 'శవాన్ని ఇక్కడినుంచి తీద్దాం ఊళ్ళోకి తీసుకపోదాం' అని ఎవరో అనేసరికి చిన్నా తల్లి ఆక్రోషంగా గొంతు విప్పింది..'రోడ్డు బాగుంటే నాబిడ్డ నాకు దక్కేవాడు, ఓటును నోటుకు అమ్ముకోటం వల్లే మనకు ఈగతి పట్టింది.. ఇలాంటి కడుపుకోత ఇంకెవరికీ రావొద్దు..శవాన్ని ఇక్కడినుంచి తీయొద్దు ఇక్కడే పూడ్చుదాం ఓటును అమ్ముకునేవాళ్లందరికీ బుద్దొస్తుంది' అని గుండెలవిసేలా రోదిస్తోంది.. ఈరమ్మ, ఆమె తరం వాళ్లంతా ఓటును నోటుకు అమ్మే సంస్కృతికి సాక్షుల్లా, దోషుల్లా పశ్చాత్తాపపడుతున్నారు.

**కంచర్ల శ్రీనివాస్**
**9640311380**

---

( 8వ పేజీ తరువాయి)

ఈ మాసాన్ని ఖగోళ శాస్త్ర పరంగా పరిశీలించగా చంద్రుడు పౌర్ణమి రోజున మృగశిర నక్షతము నందు ఉండుట వలన సౌరమాన ప్రకారం సూర్యుడు ధనుస్సురాశిలో ప్రవేశించిన రోజు నుండి మకరరాశిలోకి ప్రవేశించు వరకు గల మధ్య రోజులను అనగా సంక్రాంతికి ముందు ముప్పది రోజులను ధనుర్మాసమని అంటారు. ఈ నెల రోజుల పాటు బాలికలు, మహిళలు తమ ఇళ్ల ముందు ప్రతి రోజూ అందమైన సంక్రాతి ముగ్గులు వేసి ఆవుపేడతో గొబ్బెమ్మలు చేసి ఆ ముగ్గుల మధ్యలో పెట్టి గొబ్బెమ్మల రూపంలో లక్ష్మీ దేవిరూపంగా పూలతో, పసుపు కుంకుమలతో అమ్మవారిని పూజించుతారు. చివరి రోజున రథం ముగ్గు వేసి అమ్మవారిని ఉరిగేస్తున్నట్లుగా భావన చేసి ఒక ఇంటి ముందు రథం ముగ్గు తాడును ప్రక్క ఇంటి వారు వేసిన రథం ముగ్గుకి కలిపి ఒక వరుసలో రథయాత్ర చేస్తారు. ఇది మహిళలకు ఆరోగ్యం కోసం వ్యాయామంగా కూడా ఉండేటట్లు చేసిన ఏర్పాటు. హరి దాసులు హరిభక్తులు ఇండ్ల ముందుకు వచ్చి హరికీర్తనలు పాడుతూ హరినామ సంకీర్తలు చేస్తూ ఇంటింటికి తిరుగుతారు. సంక్రాంతి ముందర గంగిరెద్దుల వాళ్ళు ఊరేగింపుగా ప్రతి ఇంటికి వస్తారు. గంగిరెద్దులకు కొత్త బట్టలు గృహస్తులు ఇచ్చి సత్కరిస్తారు. పురాణములలోను, ఆయుర్వేదాది శాస్త్రములలో చెప్పినట్లు ఈ నెలలో రాత్రి ఎక్కువగా ఉండి పగలు తక్కువగా ఉండును. అందుచేతనే పులగమును గాని దధ్యోదనమును గాని దేవునకి నివేదించి తినవలయునని నియమమును తెలియజేసారు. ఈ నెల శ్రీ మహా విష్ణువుకు ప్రీతి కరమైనది. వైష్ణవ దేవాలయములో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తారు. " శ్రీ ఆండాళ్ పాశురాలు " చదువుతారు . బ్రాహ్మీ ముహూర్త మందు స్వామి వారికి పూజలు నిర్వహించి "కటు పొంగలి" దీనినే ముద్గలాన్నం అని పప్పుపొంగలి అని కూడ అంటారు. స్వామి వారికి నివేదన చేసిన తర్వాత భక్తులకు ప్రసాదములు పంచిపెడతారు. ఈ మాసములో రకరకాల ప్రసాదాలు చేసి ప్రజలందరికీ ప్రసాద రూపంలో పౌష్టికాహారం అంద చేయటం జరుగుతుంది. శ్రీరామచంద్రుడు పట్టాభిషిక్తుడు అయ్యేది ఇక్కడే..!! ప్రతి సంవత్సరం మార్గశిర మాసం నుండి పుష్యమాసము వరకుచలి చాల ఉదృతంగా ఉంటుంది. చలికాలంలో మన శరీరంలో రక్తలో మార్పిడి జరుగుతుంది. అందువలన ఆ సమయంలో శరీరానికి పుష్టి నిచ్చే ఆహారము బీదసాదాలకి అందజేయటానికి మన ఋషులు మునులు చేసిన ఏర్పాటు ఇది.

ఈ నెలలోనే వైకుంఠ ఏకాదశి "ముక్కోటి ఏకాదశి" వస్తుంది. ఆరోజు బ్రాహ్మీ ముహూర్తంలో అందరూ ఉత్తర ద్వార దర్శనమున స్వామి వారిని తులసి మాలల అలంకరణతో దర్శించి తరిస్తారు. ఈ నెల రోజులులు వైష్ణవ దేవాలయాలు కళకళలాడుతూ కనిపిస్తాయి, ఉదయం, సాయంత్ర సమయాలలో స్త్రీలు, ముత్తైదువలు తులసికోటను అందంగా అలంకరించుకును దీపారాదన చేసి చుట్టూ ప్రదక్షిణలు చేయడం వలన మనోవాంచలు నెరవేరుతాయని పెద్దలు అంటారు, ఇది ప్రకృతి ఆరాధన మహోత్సవం జైశ్రీమన్నారాయణ.

# ఎలక్షన్ సీజన్



## చిన్నకథ

నాగావళి నదికి ఒడ్డున సంగంవలస అనే పెద్ద గ్రామమొకటి ఉంది. అక్కడే సువర్ణముఖి, వేగావతి నదులు నాగావళిలో కలుస్తున్నాయి. అందుకే ఆ ప్రాంతాన్ని త్రివేణీసంగమం అంటారు. ఆ ప్రాంతమంతా ప్రాకృతికశోభతో అత్యంత ఆహ్లాదకరంగా ఉంటుంది. కొండల నడుమ గుండా ప్రవహించే నదుల గలగలల సోయగాలు యాత్రికులను కనువిందు చేస్తుంటాయి. ఆ నదులకు ఆనుకుని ఉన్న పంటపొలాలు పచ్చదనంతో పలకరిస్తుంటాయి. అంత అందమైన సంగంవలస గ్రామంలో రాఘవవర్మ ఏకైక భూస్వామి. గతంలో వారి పూర్వీకులే రాజులూ జమీందారులూను. అక్కడ కొంతమేర శిథిలావస్థలో ఉన్న కోట ఒకటి ఉంది. ఆ కోటలో ఓ ప్రక్కన ఒక అధునాతన భవనం ఉంది. అదే రాఘవవర్మ నివాసం.

వర్మ సంగంవలస నియోజకవర్గానికి గతసారి జరిగిన సాధారణ ఎన్నికలలో శాసనసభ్యునిగా పోటీచేసి ఓడిపోయారు. గతంలో వారి తాత మాధవవర్మ మూడుసార్లు ఎమ్మెల్యే అయ్యారు. తర్వాత వారి తండ్రి విక్రమవర్మ ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి, రెండుసార్లు మంత్రిగా కూడా పదవిని అలంకరించారు. ఒకప్పుడు వారి తాతదండ్రుల్లా నేడు వీరికి గెలుపేమి సునాయాసం కాదు. ఎందుకంటే ఆ నియోజకవర్గంలో వారి సామాజిక వర్గం ఉండేది బహుస్వల్పమే. నేడు బహుజన సామాజిక వర్గాలలో రాజకీయ చైతన్యం పెరిగింది. ఆయా వర్గాలు ఐక్యంగా పనిచేయడంతో జనాభాపరంగా తక్కువ ఉన్న అగ్రవర్ణాల గెలుపేమి ఇంతకుమునుపులా సులువు కాదు. అందువల్లనే వర్మ గత ఎన్నికల్లో పోటీచేసి ఓ సామాన్యుడి చేతిలో ఓడిపోయాడు. ముఖ్యంగా ఈ ప్రాంతంలో ఉన్న బహుజన వర్గానికి చెందిన ఓ సామాజిక వర్గం రాజకీయాలను బాగా శాసిస్తున్నది. అందువల్ల అగ్రవర్ణ వర్గాలకు చెందిన రాఘవవర్మ గెలుపు ఆనాడు అసాధ్యమైంది. కానీ వర్మ ఈసారైనా గెలిచి ఎమ్మెల్యే కావాలని తహతహలాడుతున్నాడు. ఈసారి ఎన్నికల్లో ఎలాగో ఒకలాగా విజయాన్ని సాధించాలనే పట్టుదలతో ముందుకు పోతున్నాడు. డబ్బు అంతకు పదింతలు విరజల్లాలనే ఆలోచనతో ఉన్నాడు. తన తండ్రీతాతల్లా గెలిచి తన సత్తా ఏంటో అందరికీ చాటాలనుకుంటున్నాడు. అయితే ఒకవైపు తనకు గెలుపు సాధ్యం కాకపోవడం పట్ల బాధతో ఉన్నాడు కూడా.

ఈ రోజుల్లో ఎమ్మెల్యేగా గెలవాలంటే కోటానుకోట్లు డబ్బులు అవసరం. ఆర్థికంగా వర్మను ఎదుర్కొనే సత్తా ఎవరికీ లేదు. కానీ గతసారి జరిగిన ఎన్నికల్లో ఆయన ఓటమిపాలైయ్యారు. సాధారణంగా బహుజన వర్గాల అభ్యర్థులు అంతలా ఖర్చు పెట్టలేని స్థితిలో ఉంటారు. అయినప్పటికీ గత ఎన్నికలో ఆ వర్గాల ప్రజలు ఒక్కొక్కరుగా డబ్బులు చందాలుగా వేసుకుని తమ అభ్యర్థిని గెలిపించుకున్నారు. అంటే ప్రజాదరణ, కులం బలంగా ఉంటే డబ్బు నామమాత్రమే అని తెలుస్తున్నది. అది వర్మకు కూడా ఎరుకే. కానీ ఈసారి ఎన్నికల్లో వర్మ గెలవాలంటే బహుజన వర్గాల్లో చీలికలు తేవాలి. బహుజనుల్లో ఉన్న వెనుకబడిన వర్గాలు, దళితులు, మైనార్టీలలో తగాదాలు సృష్టించాలి. అలా సృష్టించే ప్రయత్నాల్లో రాఘవవర్మ ఉన్నారు. అయితే నేటి బహుజన సాధికారత ఉద్యమంలో విరివిగా పాల్గొంటున్న క్రింది వర్గాల ప్రజలు వర్మ ఎత్తులను పారనీయడం లేదు. అనేక విధాలుగా ప్రయత్నిస్తున్నప్పటికీ వర్మకు శత్రువర్గాలలో చీలిక తెచ్చేందుకు అవకాశం దొరకటం లేదు. అది వర్మకు మింగుడుపడని విషయం.

ఈ దఫా ఎన్నికలు రానే వచ్చాయి. నోటిఫికేషన్ విడుదలయ్యింది కూడా. ఒకవైపు నామినేషన్ పత్రాలు భారీయెత్తున దాఖలవుతున్నాయి. ఇదే అదనుగా భావించి తిరిగి ఎన్నికల్లో పోటీ చేసేందుకు వర్మ పావులు కదుపుతున్నారు. ఈ క్రమంలో అతను నామినేషన్ పర్వం పూర్తయింది. నామినేషన్ వేసేందుకు తమ పార్టీ వారిని, డబ్బు ఎరజూపి మిగతా మరికొంత మందిని పోగేసుకొని అట్టహాసంగా వర్మ తన పని పూర్తి చేసుకున్నారు.

ఇదిలా ఉంటే గతసారి వర్మను భారీ మెజారిటీతో ఓడించిన బహుజన అభ్యర్థి పారయ్య ప్రజా సంక్షేమం కోసం పాటుపడడంలో విఫలమయ్యాడు. పనితనం చూపకపోవడంతో ప్రజలు అతని అభ్యర్థిత్వాన్ని ఇప్పుడు తిరస్కరించుచున్నారు. దాంతో బహుజనులలో కొత్త అభ్యర్థిని నిల్చోపెట్టడానికి చర్చ వచ్చింది. ఎవరిని నిలబెట్టాలని చర్చించే క్రమంలో ఏకాభిప్రాయం కుదిరిందిలా. కుశాలపురం మేజర్ పంచాయతీ గ్రామంలో సన్యాసప్పలనాయుడు అనే బహుజన వర్గానికి చెందిన యువకుడు సర్పంచ్ అయ్యాడు. సన్నకారు రైతు కుటుంబానికి చెందిన నాయుడు ఉన్నత విద్యను అభ్యసించాడు. చదువుకున్న రోజుల్లో ప్రజాతంత్ర ఉద్యమాలలో విరివిగా పాల్గొన్న ఉపాధ్యాయులు అతనిలో సామాజిక స్పృహ కలిగేలా తీర్చిదిద్దారు. దాంతో నాలుగేళ్ల కాలంలో తన గ్రామాన్ని ఆదర్శవంతంగా తయారుచేసాడు. కేవలం ప్రభుత్వ నిధులతోనే కాకుండా, గ్రామ ప్రజలందరి సహకారంతో నిధులు సేకరించి ప్రాధాన్యతా క్రమంలో ఊరి అభివృద్ధికి కృషి చేస్తున్నాడు. సర్పంచ్ గా తన హయాంలో విద్యార్థుల, నిరుద్యోగుల పురోభివృద్ధికై ముందుగా గ్రామంలో ఒక గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశాడు. ఆ గ్రంథాలయంలో చదువుకున్న యువతీయువకులు ఎక్కువ మంది ఉద్యోగులుగా మారారు. అక్కడి విద్యార్థులు ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దబడడంతో, అదికాస్తా చుట్టుపక్కల గ్రామాల్లో మ్రారుమోగింది. అలాగే తన ఊరిలో ఉన్న పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పన చేసారు. ఇంకా రహదారుల నిర్మాణము, త్రాగునీటి కల్పన, మురికి కాల్వల నిర్వహణ, చెత్త సేకరణ కేంద్రం ఏర్పాటు మొదలగు కార్యక్రమాలతో అద్భుతమైన పాలనను అందించాడు. ఇలా నాయుడు అందరూ దృష్టిని ఆకర్షించాడు. బహుజన సాధికారక కమిటీ వారు ఏకాభిప్రాయంతో సన్యాసప్పలనాయుడే వర్మకు దీటైన అభ్యర్థని తీర్మానం చేసారు. దాంతో నాయుడు నామినేషన్ కార్యక్రమం పెద్దయెత్తున చేపట్టారు. ఇది వర్మ గుండెల్లో గుబులు రేపింది. అయినప్పటికీ తన రాజకీయ ఎత్తుగడలతో రాఘవవర్మ నామినేషన్ వేసి, ఉధృతంగా ప్రచారం చేపడుతున్నాడు. ఈ నేపథ్యంలో ఒకనాడు కుశాలపురం గ్రామానికి వర్మ వచ్చి ఎన్నికల ప్రచారసభ పెట్టారు. ఆ సభలో వర్మ తన తాతముత్తాతల ఔదార్యాన్ని, పరిపాలనను చెబుతూ తనకి ఓటు వేయాలని అభ్యర్థిస్తున్నాడు. నేను గెలిస్తే మన నియోజకవర్గ పరిస్థితిని మారుస్తానని, మీ అందరి సంక్షేమానికి పాటుపడతానని హామీలు గుప్పిస్తున్నాడు. నాకు ఒక్క అవకాశం ఇవ్వాలని కోరుకుంటున్నాడు. దాంతో ఆ గ్రామ యువత ముందుపడి సభాస్థలి వద్దకు పోయి అయ్యా వర్మగారూ%ౌ%మీరూ, మీ తాత ముత్తాతలు ఈ ప్రాంతానికి ఒరగబెట్టింది చాలు. మీ ఆధిపత్య భావజాలంతో మాపై జరిపిన వేధింపులు, దాడులు మాకు తెలుసు. మమ్మల్ని బానిసలుగా చేసి, మా శ్రమను దోచుకోవడంలో మీ నైపుణ్యం మేమెరుగుదం. ఇంకా మీ పప్పులు ఉడకవు. ఇవి ఆనాటి సత్తెకాలపు రోజులు కావు. మిమ్మల్ని నమ్మి తిరిగి మోసపోవడానికి అని, గట్టిగా సమాధానం ఇచ్చారు. అలా అంటూనే ఈసారి మా వర్గం యువనాయకుడు సన్యాసప్పలనాయుడిని మీకు పోటీగా నిలుపుతున్నాం. కాచుకోండిక అనేసరికి, వర్మ గారి ముఖం మాడిపోయింది. ఏమిటి వీరి చైతన్యం? ఏమిటి వీరి తిరుగుబాటు? అని ఒక్కసారిగా ఆశ్చర్యపోయాడు. వేదిక మీద నుండి దిగి చల్లగా జారుకున్నాడు.

అంతే ఆ క్షణమే ఊరి జనం అంతా సన్యాసప్పలనాయుడును ఎత్తుకొని అక్కడకొచ్చి జయజయధ్వానాలు పలికారు. చేతుల్లో నీలిరంగుల జెండాలను రెపరెపలాడించారు. ఎన్నికల రోజు రానే వచ్చింది. ప్రజలంతా చక్కగా ఓటు హక్కును వినియోగించుకున్నారు. తన మంచితనం, పనితనమే నాయుడును భారీ మెజారిటీతో ఎమ్మెల్యేగా గెలిపించింది. డబ్బే అన్నివేళలా అన్ని దగ్గర్లా పనిచేస్తుందని ఎవరైనా అనుకుంటే పొరపాటు. ఒక్కోసారి రాజకీయ గాలి ఎటువీస్తే అటే లాభం చేకూరుతుంది. చివరికి మానవవాదమే విజయాన్ని సాధిస్తుందని రాఘవవర్మ గ్రహించారు.

**పిల్లా తిరుపతిరావు-7095184846**

# 'శంకరాభరణం' కథామర్మం




'పాశ్చాత్య సంగీతపు పెనుతుఫానుకు రెపరెపలాడుతున్న సత్సాంప్రదాయ సంగీత జ్యోతిని ఒక కాపు కాయడానికి తన చేతులు అడ్డుపెట్టిన ఆ దాత ఎవరో'

ఎవరు? బెంగళూరు నాగరత్నమ్మ.

శంకరాభరణం కథ ఎలా పుట్టి ఉంటుంది? ఈ కథ రాయడానికి కె.విశ్వనాథ్ గారు ఎక్కడి నుంచి ఇన్‌స్పయిర్ అయి ఉంటారు, కథను మెల్లమెల్లగా ఎలా కల్పించుకుని ఉంటారు,

ఎలా తుదిరూపు ఇచ్చి ఉంటారు అనేది ఒక కథకుడిగా నాకు ఎప్పుడూ ఆసక్తి. కాని విశ్వనాథ్ గారు ఎప్పుడూ, తన చివరి రోజుల వరకూ కూడా, ఎన్ని ఇంటర్వ్యూలలో కూడా శంకరశాస్త్రి పాత్రకు, తులసి పాత్రకు ఇన్‌స్పిరేషన్ ఎవరు అనేది చెప్పలేదు. వనిత టీవీ ఇంటర్వ్యూలో మాత్రం 'అదొక క్షేత్ర పురాణం' అనగలిగారు.

అవును క్షేత్ర పురాణమే. త్యాగరాజ క్షేత్ర పురాణం. తిరువయ్యారు క్షేత్ర పురాణం. శంకరాభరణం కథకు ఈ క్షేత్రమే ఇన్‌స్పిరేషన్. ఎందుకంటే నాటి త్యాగయ్యే నేటి శంకర శాస్త్రి! నాటి బెంగళూరు నాగరత్నమ్మే నేటి తులసి!

గత కొన్ని రోజులుగా త్యాగయ్యను చదువుతున్నాను. డాక్యుమెంటరీలు చూస్తున్నాను. తమిళ దూరదర్శన్ వారు తీసిన డాక్యుమెంటరీలో త్యాగయ్య తెలుగువాడు అని చెప్పడానికి నోరు రాలేదు. కాని ఎవరో తమిళ విద్వాంసుడు పాడిన 'సీతమ్మ మాయమ్మ శ్రీరాముడు మాకు తండ్రి' వినిపిస్తే కళ్లు చిప్పిల్లాయి. సీతమ్మను తల్లిగా, శ్రీరాముణ్ణి తండ్రిగా స్వీకరించిన ఈ సదా శిశువునకు ఇక జీవన వ్యవహారాల చింత ఏల?

'నిరాదరణ పొందుతున్న శాస్త్రీయ సంగీతాన్ని పోషించడానికి కోటికి ఒక్క వ్యక్తి ఉన్నా సరే ఈ అమృతవాహిని అనంతంగా ఇలా ప్రవహిస్తూనే ఉంటుంది' అంటాడు శంకర శాస్త్రి క్లయిమాక్స్‌లో.

శంకరాభరణం అంతిమ మెసేజ్ ఇదే. కళాకారులు... పోషకులు. ఈ ఇరువర్గాలు లేకపోతే కళ లేదు. శంకరాభరణం ఈ ఇరువర్గాల ప్రతినిధుల కథ. కళాకారుడు శంకరశాస్త్రి. పోషకురాలు తులసి. త్యాగరాజస్వామి కథ కూడా ఇది కాదా? బెంగళూరు నాగరత్నమ్మ లేకుండా త్యాగరాజస్వామి కథ ఎంత అసంపూర్ణం?

1920ల నాటికి బెంగళూరు నాగరత్నమ్మకు రెండు లక్షల రూపాయల ఆస్తి ఉండేదని 'గృహలక్ష్మి' పత్రిక రాసింది. గొప్ప విద్వాంసురాలిగా, నాట్యకత్తెగా, దేవదాసీగా (అందుకు ఆమె గర్విస్తుంది) ఆమెకు ఒక అస్తిత్వం, జీవనం ఉన్నా దానంతటినీ త్యజించి త్యాగరాజస్వామి కొరకు జీవితాన్ని అంకితం చేసిందామె. జీర్ణస్థితిలో ఉన్న త్యాగయ్య సమాధిని పునరుద్ధరించి, గుడి కట్టి, సత్రాలు నిర్మించి, ఆరాధనోత్సవాల్లో ముందంజ వేసి, ఆస్తి దారబోసి ఆ మహనీయుడికి వర్తమానంలో పునర్ఘనతను తెచ్చి%--% అచ్చు శంకరశాస్త్రి పాదాల మీద పడి తులసి ప్రాణం విడిచినట్టే తాగయ్య సమాధి చెంతే ప్రాణం విడిచింది. అక్కడే సమాధి అయ్యింది. నేటికీ త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాల్లో పంచకృతులు పాడి త్యాగయ్యను ఆరాధిస్తే, నాదస్వర గానంతో బెంగళూరు నాగరత్నమ్మకు ఘనంగా నివాళి అర్పిస్తారు.

రెండు వేరువేరు కాలాల్లో జీవించి మరణించిన ఈ ఇరువురిని వర్తమానంలో తెచ్చి, వారిరువురి చుట్టు ఒక ఉదాత్తమైన కథను అల్లగలగడం కె.విశ్వనాథ్ మేధోసృజనకు ఉదాహరణ. మరి ఈ విషయం ఎందుకు బయటకు వెల్లడి చేయలేదు? చేస్తే అనేక ప్రశ్నలు రావచ్చు. లేనిపోని చర్చలు జరుగవచ్చు. ఉదాహరణకు త్యాగయ్యది రామభక్తి. శంకరశాస్త్రిది శైవారాధన. ఇక్కడితో మొదలు. పాత్రల సారం వరకే దర్శకుడు తీసుకున్నాడని అర్థం చేసుకుని వదిలే రకం కాదు కదా మనం. ఒకవేళ మనం వదిలినా ఎన్.ఆర్.ఐలు వదలరు.

అయినప్పటికీ కె.విశ్వనాథ్ గారి సబ్/కాన్షియస్ మైండ్ ఈ కథ అల్లికలో ఇది త్యాగయ్య, నాగరత్నమ్మల స్ఫూర్తి అని హింట్స్ వదలుతూనే ఉంటుంది. శంకరాభరణం ఫస్ట్‌సీన్‌లో శంకరశాస్త్రి నది ఒడ్డున జీర్ణవస్త్రాన్ని ఉతికి ఆరబెడతాడు. తులసి చూస్తుంది.

**(మిగతా వచ్చేవారం)**

